RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8
సంచిక (Issue) : 321 వెల - రూ 5:00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

ఆదివారం 09, ఏప్రిల్ 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,

## బేగంపేటలో మోడీకి ఘన స్వాగతం

- స్వాగతం పలికిన గవర్నర్ తమిళసై
- కిషన్ రెడ్డితోపాటు పలువురు బిజెపి నేతల స్వాగతం
- ప్రభుత్వం తరపున స్వాగతం పలికిన తలసాని
- హాజరైన సిఎస్ శాంతికుమారి, డిజిపి
- ప్రధాని మోడీ పర్యటనకు దూరంగా సిఎం కెసిఆర్

హైదరాబాద్,ఏప్రిల్ 8 (ప్రజా మంటలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనని గంటల పర్యటన కోసం శనివారం 11-30 గంటలకు హైదరాబాద్ బేగంపేట్ ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. ప్రత్యే విమానంలో ఆయన బేగంపేటకు వచ్చారు. మోదీకి స్వాగతం పలికేందుకు బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున ఎయిర్ పోర్టుకు తరలి



వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రోటోకాల్ ప్రకారం గవర్నర్ తమిళిసైతోపాటు

మిగతా... 2లో



# అవినీతిపరులను.. శిక్షించాలా... వద్దా..?

- తెలంగాణలో అవినీతి రాజ్యమేలుతోంది
- అవినీతి, కుటుంబ పాలనతో అభివృద్ధికి ఆటంకం
- అవినీతిపై పోరాడాలా వద్దా అని ప్రజలకు ప్రశ్నలు
- కెసిఆర్, బిఆర్ఎస్ పేరు ఎత్తకుండానే విమర్శలు
- వందేభారత్ రైలుకు సికింద్రాబాద్‌లో పచ్చ జెండా
- పరేడ్ గ్రౌండ్ వేదికగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

హైదరాబాద్,ఏప్రిల్8 (ప్రజా మంటలు) : అవినీతి, కటుఉంబ పాలనకు చరమగీతం పాడాలని ప్రధాని మోడీ తెలంగాణ ప్రజలకు పిలుపునిచ్చారు. కుటుంబ పాలన కారణంగానే అవినీతి పెరిగిందని, ఈ రెండూ కలిసే ఉంటున్నాయని అన్నారు. హైదరాబాద్ వేదికగా పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ప్రధాని మోడీ పరేడ్ గ్రౌండ్స్ వేదికగా తెలంగాణ రాష్ట్రంలో పాలన తీరును ఎండగట్టారు. రాష్ట్రంలో కుటుంబం, అవినీతి పాలన నడస్తుందని.. ప్రతి ప్రాజెక్టులో అవినీతి వల్ల ఆలస్యం అవుతుందన్నారాయన. అధికార పార్టీ పేరు ఎత్తుకుండానే.. ఎవరి పేరు ప్రస్తావించకుండానే తెలంగాణ రాష్ట్రంలో అధికార పార్టీ

మిగతా... 2లో

## 14 వందే భారత్ రైళ్లలో రెండు మనకే

- తెలంగాణ అభివృద్ధికి మోడీ కృషి
- ప్రధాని మోడీని తెలంగాణ ప్రజలు ఆశీర్వదించాలి
- ప్రధాని సభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్8 (ప్రజా మంటలు) : ఇప్పటి వరకు దేశంలో 14 వందే భారత్ రైళ్ళను ప్రారంభిస్తే.. అందులో రెండు తెలంగాణకు ప్రధాని బహుమతిగా ఇచ్చారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు శంకుస్థాపన చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్ నిలిచిపోయిందని, కేంద్ర ప్రభుత్వం మేడ్చల్ వరకు ఎంఎంటీఎస్‌ను స్టార్ట్ చేస్తోందని తెలిపారు.రాష్ట్రం సహకారం లేకున్నా పనులను ప్రారంభిస్తున్నామని అన్నారు. మహబూబ్‌నగర్ రైల్వే డబ్లింగ్, హైవేలు, బీబీనగర్ ఎయిమ్స్ వంటి వాటికి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్నారని చెప్పారు. తెలంగాణను అన్ని రకాలుగా ఆదుకుంటున్న.. ప్రధాని నరేంద్ర మోడీని రాష్ట్ర ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన సభలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొని.. ప్రసంగించారు. తెలంగాణ ప్రజలకు

మిగతా... 2లో





## సుఖోయ్ యుద్ధవిమానంలో రాష్ట్రపతి

### రెండో మహిళా రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము

గౌహతి,ఏప్రిల్8 (ప్రజా మంటలు) : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుఖోయ్ యుద్ధ విమానంలో ప్రయాణించారు. తద్వారా యుద్ధ విమానంలో విహరించిన రెండవ మహిళా రాష్ట్రపతిగా ముర్ము రికార్డు క్రియేట్ చేశారు. అస్సాం పర్యటనలో ఉన్న ఆమె.. తేజ్‌పూర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో శనివారం సార్టీ నిర్వహించారు.ఫైటర్ పైలెట్ దుస్తుల్లో ఆమె సుఖోయ్‌లో విహరించారు. కమాండర్ ఆఫ్ ఆర్డ్మ్ ఫోర్సెస్ హోదాలో ఆమె ఈ సార్టీ చేపట్టారు. తేజ్‌పూర్‌లోని భారత వాయుసేనకు చెందిన వ్యూహాత్మక వైమానిక స్థావరానికి చేరుకున్న రాష్ట్రపతి ముర్ము..

మిగతా... 2లో



## తెలంగాణకు ఏమిచ్చారు.. ఎక్కడ అడ్డుపడ్డాం

- అధికారిక కార్యక్రమాల్లో రాజకీయ విమర్శలా
- మోడీ విమర్శలపై మండిపడ్డ బిఆర్ఎస్
- ఆదానీ అవినీతి గురించి ఎందుకు మాట్లాడరు
- తెలంగాణ అభివృద్ధి సాధిస్తేనే కదా...అవార్డులు

మీడియా సమావేశంలో మంత్రులు తలసాని, గంగుల, శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్,ఏప్రిల్8 (ప్రజా మంటలు) : ప్రధాని మోడీ హైదరాబాద్ పర్యటనలో చేసిన విమర్శలను అధికార బిఆర్ఎస్ తిప్పికొట్టింది. ఘాటుగా విమర్శలు చేసింది. కేంద్రం ఏమిచ్చిందని రాష్ట్రం అభివృద్ధిని అడ్డుకుంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు. మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశంతో కలిసి బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో మీడియా

మిగతా... 2లో

## చందాకొచ్చర్ దంపతులపై సిబిఐ కేసు

- సిబిఐ చార్జిషీట్ దాఖలు చేసినట్లు వెల్లడి

న్యూఢిల్లీ,ఏప్రిల్8 (ప్రజా మంటలు) : రూ. 3,250 కోట్ల రుణ మోసం కేసులో ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ ఎండి, సిఇఓ చందాకొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ గ్రూప్ వ్యవస్థాపకుడు వేణుగోపాల్ ధూత్‌లపై కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐ చార్జిషీట్ దాఖలు చేసినట్లు అధికారులు శనివారం వెల్లడించారు. ఇండియన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్లు 120-బి , 409 నేరపూరిత విశ్వాస ఉల్లంఘనతోపాటు.. అవినీతి నిరోధక చట్టంలోని ఇతర నిబంధనల కింద వీరిపై సిబిఐ



చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ వ్యవహారంలో మొత్తం కంపెనీలు, వ్యక్తులతో సహా 9 మందిని కుట్రదారులుగా సిబిఐ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో చందా కొచ్చర్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి ఎలాంటి అనుమతి అవసరం లేకుండానే సీబీఐ తన తుది నివేదికను ముంబైలోని ప్రత్యేక కోర్టుకు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ చార్జిషీట్‌ను సీబీఐ ప్రత్యేక కోర్టు ఇంకా పరిగణలోకి తీసుకోలేదని అధికారులు తెలిపారు. దీనికోసం ఐసీఐసీఐ నుంచి తగిన అనుమతులు కోరుతూ లేఖ పంపి నట్లు అధికారులు తెలిపారు. కాగా, కొచ్చర్ దంపతులను, వేణుగోపాల్ ధూత్‌లను సిబిఐ గతేడాది డిసెంబర్‌లో అరెస్టు చేసింది. వీరి రిమాండడ్ కోసం సిబిఐ

మిగతా... 2లో




## ప్రకృతి వైద్యాన్ని ప్రోత్సహిస్తున్నాం...

- సనాతన భారతీయ వైద్యాన్ని ప్రోత్సహిస్తున్నాం
- ప్రకృతి వైద్యానికి తెలంగాణ కేరాఫ్ అడ్రస్
- అమీర్‌పేట నేచర్‌క్యూర్ ఆస్పత్రిలో అభివృద్ధి పనులు
- స్పీకర్ పోచారంతో కలసి ప్రారంభించిన మంత్రులు

హైదరాబాద్,ఏప్రిల్8 (ప్రజా మంటలు) : సనాతన భార తీయ వైద్యాన్ని ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్నివిధాలుగా పనిచేస్తున్నదని మంత్రి హరీశ్ రావు వెల్లడించారు. హెల్త్‌హబ్ అయిన హైదరాబాద్‌లో చికిత్స పొందేందుకు దేశ విదేశాల నుంచి ఇక్కడికి పేషెంట్లు వస్తుంటారని, ఆయుష్ వైద్యం పొందేందుకు సైతం వచ్చేలా నేచర్ క్యూర్ దవాఖాన ఎదుగాలన్నారు. ప్రకృతి వైద్యానికి తెలంగాణ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచేలా కృషి చేయాలని సీఎం కేసీఆర్ చెప్పారని మంత్రి అన్నారు. హైదరాబాద్ అమీర్‌పేటలోని నేచర్‌క్యూర్ దవాఖానలో రూ.10 కోట్లతో ఏర్పాటు చేసిన అత్యాధునిక వసతులు, అభివృద్ధి పనులను స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. రూ.10 కోట్లతో ఈ దవాఖానను అభివృద్ధి చేసుకున్నామన్నారు. వైద్య రంగంలో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణ.. ఆయుష్ చికిత్సల్లో కూడా అగ్రభాగాన ఉండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన. ప్రకృతి వైద్యం కోసం ఎంతో మంది ప్రైవేటుకు వెళ్లి లక్షల రూపాయలు ఖర్చు చేసు కుంటున్నారు. అలాంటి

మిగతా... 2లో

## ప్రజానాడి




## వచ్చే 8 నెలలు కీలకం



- అధికారమే లక్ష్యంగా పని చేయాలి
- కాంగ్రెస్ శ్రేణులకు రేవంత్ సూచన

హైదరాబాద్,ఏప్రిల్8 (ప్రజా మంటలు) : రాబోయే 8 నెలల పాటు అవిశ్రాంతంగా పని చేయాలని, ఇది చాలా కీలకమైన సమయమని పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. మనమంతా కష్టపడి పనిచేసతే అధికారం మనదేనని అన్నారు. అధికార బిఆర్ఎస్, బిజెపిల డ్రామాలను ప్రజల్లో నిలదీయాలన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని

మిగతా... 2లో

## ప్రధాని కార్యక్రమాలకు కెసిఆర్ ఎందుకు రాలేదు

- తెలంగాణ అభివృద్ధిపై కెసిఆర్‌కు శద్ధ లేదు
- వస్తే సన్మానిద్దామనుకుని శాలువా కూడా తెచ్చా
- మీడియాతో బండి సంజయ్ ఆగ్రహం

హైదరాబాద్,ఏప్రిల్8 (ప్రజా మంటలు) : ప్రధాని మోడీ సభకు సీఎం కేసీఆర్ ఎందుకు రాలేదో చెప్పాలని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ప్రశ్నించారు. కేసీఆర్ ఇవాళ్టి షెడ్యూల్ బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ కోసం తాను చాలా ఎదురు చూశానన్న సంజయ్...

మిగతా... 2లో



## సుఖోయ్ యుద్ధవిమానంలో రాష్ట్రపతి

తొలుత భద్రతా దళాల నుంచి సైనిక వందనం అందుకున్నారు. ఆ తర్వాత ఆమె ఫ్లయింగ్ సూట్ ధరించి సుఖోయ్-30 విమానంలో కొద్దిసేపు విహరించారు. ఈ విమానాన్ని గ్రూప్ కెప్టెన్ నవీన్ కుమార్ తివారీ నడిపారు. నవీన్ కుమార్‌తో పాటు కో-పైలట్‌గా ప్రయాణించారు ముర్ము. రాష్ట్రపతి ముర్ము కంటే ముందు,



మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, ప్రతిభా పాటిల్, రామ్‌నాథ్ కోవింద్ ఎయిర్ ఫోర్స్ ఫైటర్ జెట్‌లలో ప్రయాణించారు. కాగా తేజ్‌పూర్ విమానాశ్రయం తవాంగ్ సెక్టార్‌కు దగ్గరగా ఉంటుంది. ఈ సుఖోయ్ 30 ఓఐఎ..ట్విన్ సీటర్ ఫైటర్ జెట్..దీన్ని రష్యాకు చెందిన సుఖోయ్ సంస్థ డెవలప్ చేసింది. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థ ఈ÷టైర్ జెట్‌ను నిర్మించింది. కాగా మూడు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గత గురువారం అస్సాం చేరుకున్నారు. శుక్రవారం కజిరంగ జాతీయ పార్కులో జరిగిన గజ్ ఉత్సవ్‌ను ఆమె ప్రారంభించారు. పర్యటనలో భాగంగా మౌంట్ కాంచనగంగ సాహసయాత్ర - 2023ను కూడా ఆమె ప్రారంభించారు. అలాగే గువహటిలో రాష్ట్ర హైకోర్టును ఏర్పాటు చేసి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు.

## బేగంపేటలో మోడీకి ఘన స్వాగతం

**మొదటిపేజీ తరువాయి..**

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ , సిఎస్ శాంతికుమారి, కేంద్రవ కిషన్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ , ఎంపీ అరవింద్ , ఎమ్మెల్యేలు ఈటల, రఘునందన్ రావు, డీజీపీ, విమానాశ్రయానికి చేరుకుని ప్రధాని మోదీకి స్వాగతం పలికారు. ప్రధానితోపాటు వారంతా రోడ్డు మార్గం ద్వారా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. సికింద్రాబాద్-తిరుపతి మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధాని మోదీ ప్రారంభించారు. రెండు గంటలపాటు జరిగే ఈ సుడిగాలి పర్యటనలో దాదాపు రూ. 12వేల కోట్లతో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసారు. కాగా ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో సీఎం కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రధాని మోదీని ఆహ్వానించేందుకు బేగంపేట్ ఎయిర్‌పోర్టుకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. మోదీ పర్యటనకు సీఎం కేసీఆర్ దూరంగా ఉన్నారు. అధికారిక కార్యక్రమాలు అయినా మోడీకి స్వాగతం పలికేందుకు కానీ, కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కానీ రాలేదు. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు ముఖ్యమంత్రి కేసీఆర్ దూరంగా ఉన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు వందే భారత్ రైలును మోదీ ప్రారంభించారు. ఇది అధికారిక కార్యక్రమం. దాంతో, సీఎం కేసీఆర్‌కు పీఎంవో నుంచి ఆహ్వానం అందింది కూడా. ఏడు నిమిషాల పాటు కేసీఆర్‌కు మాట్లాడే సమయం కూడా ఇచ్చారు. అధికారిక కార్యక్రమం అయినా సీఎం కేసీఆర్ వెళ్లలేదు. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా సీఎం కేసీఆర్ వెళ్లకపోవడం ఇదే తొలిసారి కాదు. గత ఏడాది ఫిబ్రవరి 5న ముచ్చింతల్‌లోని చిన జీయరు స్వామి ఆశ్రమంలో సమతామూర్తి విగ్రహావిష్కరణకు ప్రధాని మోదీ హాజరయ్యారు. శిలాఫలకంపై తన పేరు లేదన్న కోపంతో అప్పట్లో మోదీకి స్వాగతం, వీడ్కోలు చెప్పడానికి కూడా కేసీఆర్ వెళ్లలేదు. ఆ తర్వాత, ఐఎస్‌బీలో జరిగిన కార్యక్రమానికి ప్రధాని హాజరైనా కేసీఆర్ వెళ్లలేదు. ఇక్రిశాట్‌లో జరిగిన కార్యక్రమానికి ప్రధాని వచ్చినా కెసిఆర్ వెళ్లలేదు.

## చందాకొచ్చర్ దంపతులపై సిబిఐ కేసు

**మొదటిపేజీ తరువాయి..**

చేసిన అభ్యర్థనను వ్యతిరేకిస్తూ, కొచర్ల తరఫు సీనియర్ న్యాయవాది అమిత్ దేశారు 2021 జూలైలో సీబీఐకి ఐసీఐసీఐ బ్యాంక్ రాసిన లేఖను కోర్టు దష్టికి తీసుకువచ్చారు. ప్రశ్నార్థకమైన ఏ లావాదేవీలోనూ తమకు తప్పుడు నష్టం జరగలేదని పేర్కొంది. ఈ క్రమంలో బాంబే హైకోర్టు జనవరి 9న దంపతులకు బెయిల్ మంజూరు చేసింది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్, ఆర్‌బిఐ మార్గదర్శకాలు, బ్యాంక్ క్రెడిట్ పాలసీని ఉల్లంఘిస్తూ ధూత్ ప్రమోట్ చేసిన వీడియోకాన్ గ్రూప్ కంపెనీలకు ఐసీఐసీఐ బ్యాంక్ రూ.3,250 కోట్ల మేరకు రుణాలను మంజూరు చేసిందని సీబీఐ ఆరోపించింది. క్విడ్ ప్రోకోలో భాగంగా ధూత్ సుప్రీమ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఇపిఎల్) ద్వారా.. కొచ్చర్ భర్తకు చెందిన నూపవర్ రెన్యూవబుల్స్‌లో రూ.64 కోట్ల పెట్టుబడి పెట్టారు. సర్క్యూట్ మార్గంలో దీపక్ కొచ్చర్ నిర్వహించే పినాకిల్ ఎనర్జీ ట్రస్ట్‌కు ఎస్ఇపిఎల్‌ని బదిలీ చేశారు.

## వచ్చే 8 నెలలు కీలకం

**మొదటిపేజీ తరువాయి..**

గెలిపించాలని గ్రామాల్లో ప్రజలకు తెలియచేయాలని అన్నారు. నాయకులు, వారికి కేటాయించిన బాధ్యతలను పకడ్బందీగా పని చేయాలని సూచించారు. ప్రసార మాధ్యమాలలో మన వాదన బలంగా వినిపించేందుకు ప్రతి నాయకుడు సిద్ధంగా ఉండాలన్నారు. గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ఏఐసీసీ ఇంచార్జ్ మాణిక్ రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు.. ఎవరు ఎవరి కోసం పని చేస్తున్నారో ప్రజలకు వివరించాలన్నారు. పని విభజన చేసామని.. ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడం చాలా కీలకమని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరీ, నదీమ్ జావిద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని కార్యక్రమాలకు కెసిఆర్ ఎందుకు రాలేదు

**మొదటిపేజీ తరువాయి..**

కేసీఆర్‌కు సన్మానం చేసేం దుకు శాలువ కూడా తీసుకువచ్చానని అన్నారు. దేశ ప్రధాని రాష్ట్ర అభివృద్ధి కోసం హైదరాబాద్‌కు వస్తే కేసీఆర్ ఎందుకు రారన్నారు. కేంద్రం అభివృద్ధికి సహకరించడం లేదని నిత్యం ఆరోపించే కేసీఆర్ ఇప్పుడు తెలంగాణ సమాజానికి సమాధానం చెప్పాలని సంజయ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధిని కేసీఆర్ కోరుకోవడం లేదని, కుటుంబ, నియంత, అవినీతి పాలన అంతం కావాలని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని.. కానీ రాష్ట్ర సర్కార్ సహకరించడం లేదని ఆరోపించారు. అటు పలు అభివృద్ధి పనులు ప్రారంభించటానికి హైదరాబాద్ వచ్చిన ప్రధానమంత్రి మోడీ.. పరేడ్ గ్రౌండ్స్ వేదికగా తెలంగాణ రాష్ట్రంలో పాలన తీరును ఎండగట్టారు. సీఎం కేసీఆర్ పేరు ఎత్తకుండానే చురకలు అంటించారు. రాష్ట్రంలో కుటుంబం, అవినీతి పాలన నడస్తుందని.. ప్రతి ప్రాజెక్టులో అవినీతి వల్ల ఆలస్యం అవుతుందన్నా రాయన. తెలంగాణ కొందరి గుప్పిట్లో అధికారం మగ్గుతోందని మండిపడ్డారు. కుటుంబ పాలనకు విముక్తి కలగాలని చెప్పారు. కుటుంబం పాలన, అవినీతి వేర్వేరు కాదంటూనే.. ఇలాంటి వారిపై పోరాడాలా వద్దా అని ప్రజలను ప్రశ్నించారు. హైదరాబాద్ పర్యటన అనంతరం మోడీ చెన్నైకి వెళ్లిపోయారు.

# తెలంగాణకు ఏమిచ్చారు.. ఎక్కడ అడ్డుపడ్డాం

మొదటిపేజీ తరువాయి..

సమావేశంలో మంత్రి తలసాని మాట్లాడుతూ.. మోదీ అధికార కార్యక్రమంలో రాజకీయాలు మాత్రమే మాట్లాడారన్నారు. తెలంగాణపై ఆయనకు ప్రేమలేదని, ఇందుకు గతంలో రాష్ట్ర ఏర్పాటుపై చేసిన వ్యాఖ్యలే నిదర్శన మన్నారు. వందే భారత్ రైళ్లను మోదీ ఎన్నిసార్లు ప్రారంభిస్తారని ప్రశ్నించారు. అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని మోదీ అన్నారని, కేంద్రం ఏమిచ్చిందని అడ్డుకోవడానికని నిలదీశారు. అవినీతి గురించి మోదీ మాట్లాడుతున్నారని.. అదానీ అవినీతి సంగతేంటని ప్రశ్నించారు. శ్రీలంకలో అదానీకి వచ్చిన కాంట్రాక్టు ఎవరి ద్వారా వచ్చింది ? అదానీ మోసాలపై జేపీసీ వేయమంటే ఎందుకు వేయరన్నారు. తెలంగాణ అభివృద్ధి గురించి మోదీ నాతో చర్చకు వస్తారా? అని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధి సాధించకపోతే కేంద్రం ఇన్ని అవార్డులు ఎందుకు ఇస్తోందన్నారు. తలసరి ఆదాయంలో తెలంగాణ నెంబర్ వన్ అవునో కాదో ..? మోదీయే చెప్పాలన్నారు. 24 గంటల కరెంట్ రాష్ట్రంలో ఉందో లేదో మోదీ చెప్పాలన్నారు. రెండుకోట్ల ఉద్యోగాల సంగతిపై మోదీ మాట్లాడాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో లక్షా35 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. అవినీతి కుటుంబ పాలన గురించి మాట్లాడే హక్కు మోదీకి ఉందా? అని నిలదీశారు. బీజేపీలో కుటుంబ రాజకీయాలు లేవా? బీజేపీ సీఎంలు అవినీతిలో కూరుకుపోతే విచారణలు ఎందుకు ఉండవన్నారు. దేంట్లో తెలంగాణ వెనకబడిందో మోదీ చెప్పాలన్నారు. ఒక్క మెడికల్ కాలేజీ అయినా తెలంగాణకు ఇచ్చారా ..? జాతీయ రహదారులు ఎవరన్నా వస్తాయన్నారు. అందులో మోదీ గొప్ప ఏముందన్నారు. దేశానికి తెలంగాణ సమకూరుస్తున్న ఆదాయం ఎంత? కేంద్రం నుంచి ఇచ్చింది ఎంత ..? కరోనాకు వ్యాక్సిన్ కూడా తానే కనిపెట్టాను అన్నట్టుగా మోదీ మాట్లాడుతారని, ప్రోటోకాల్ ఉల్లంఘనకు తెరలేపింది మోదీయేనన్నారు. గతంలో మోదీ రాష్ట్రానికి వచ్చినప్పుడు సీఎం కేసీఆర్‌ను రావొద్దన్నారని, విభజన చట్టం హామీలపై మోదీ ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి రాష్ట్రానికి కాదు.. కనీసం సికింద్రాబాద్‌కు ఏమైనా చేశారా అని నిలదీశారు. మోదీ బాధ్యతా రహిత్యంగా మాట్లాడరని, ఆయన మాట్లాడిన మాటలపై చర్చకు సిద్ధమన్నారు. ఎవరి వాదనలో బలమెంతో చూసుకుందాం అంటూ సవాల్ విసిరారు. మోదీ మమ్మల్ని తిట్టాలనుకుంటే ఢిల్లీలో ఉండి తిట్టుకోవచ్చని.. దానికి హైదరాబాద్ రావాలా? అని ప్రశ్నించారు. మమ్మల్ని తిడితే ప్రజలే తిరగబడతారని, ప్రధాని వస్తే సీఎంలు స్వాగతం పలకాలని ఏ చట్టంలో ఉందని ప్రశ్నించారు. ప్రధానికి రాష్ట్రానికి వచ్చి ఏమైనా ప్రాజెక్టులు ఇస్తారనుకుంటే.. కేవలం తిట్టిపోయిండని మంత్రులు శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్ విమర్శించారు. గతంలో కేసీఆర్ పాలనను ప్రధాని మెచ్చుకున్న విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ కుటుంబాన్ని తిట్టడం తప్ప మోదీకి ఏమీ చేత కాదన్నారు. అదానీ కోసమే బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని పక్కన బెట్టారని, బీజేపీ గతంలో కుటుంబ పార్టీలతో పొత్తు పెట్టుకోలేదా? అంటూ మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోతే కేంద్రం అవార్డులు ఎందుకు ఇస్తోందని ప్రశ్నించారు. ఏ అంశంలోనైనా తెలంగాణతో ఇతర రాష్ట్రాలు పోటీ పడతాయా? అని ప్రశ్నించారు. దేంట్లోనైనా బీజేపీ పాలిత రాష్ట్రాలు ముందున్నాయా ? అని నిలదీశారు. మోదీ సీబీఐని గతంలో కాంగ్రెస్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అనలేదా..? అని ప్రశ్నించారు. ఇప్పుడు ప్రతిపక్షాల తీరును తప్పుబట్టడం సమంజసమా..? కాళేశ్వరానికి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదన్నారు. జాతీయ రహదారులు తెలంగాణ హక్కు అన్నారు. సున్నం వేసి ఇల్లు నాదే అన్నట్టుగా మోదీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేంద్రం ప్రాజెక్టులు చూసి నత్తలు కూడా సిగ్గు పడుతున్నాయన్నారు. ఉప్పల్ ÷÷-ల ఓవర్ నిర్మాణానికి ఇంకా ఎంత సమయం తీసుకుంటారన్నారు. తెలంగాణ మీద మోదీ కక్ష మరోసారి బయటపడిందన్నారు. కేసీఆర్‌ది కుటుంబ పాలన కాదని, తెలంగాణ అంతా కేసీఆర్ కుటుంబమేనని, మోదీది ఆదానీ కుటుంబమని విమర్శించారు. మోదీ నిధులు ఇవ్వకున్నా పర్వాలేదని, మమ్మల్ని బద్నాం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. ప్రధాని మోదీ పర్యటనలో అన్ని వర్గాలను నిరాశ పరిచారన్నారు. యాసంగి పంట కొనుగోలుపై మోదీ ఒక్క మాట కూడా మాట్లాడకుండా రైతులను నిరాశ పరిచారని, రేషన్ కార్డుల సంఖ్యను మోదీ పెంచుతారనుకుంటే అది కూడా చేయలేదని గంగుల కమలాకర్ అన్నారు. రేషన్ బియ్యంపై ప్రధాని పదవిలో ఉండి అబద్దాలు ఆడడం దురదృష్టకరమన్నారు. రేషన్ బియ్యం పేదలకు ఇవ్వకుండా ఎవరు అడ్డుకున్నారని, కుటుంబానికి బియ్యం కోటా పెంచింది రాష్ట్ర ప్రభుత్వం తప్ప కేంద్రం కాదన్నారు. రేషన్ బియ్యంపై రూ.27వేలకోట్లు ఖర్చు చేశామన్నారు. గురుకులాల గురించి మోదీ ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. వ్యవసాయం, పీడీఎస్ గురించి మాట్లాడే అర్హత మోదీకి లేదన్నారు. వెనకబడిన వర్గాలకు మోదీ చేసింది శూన్యమన్నారు. వెనకబడిన వర్గాలకు విద్యను అందించింది కేసీఆరేనన్నారు.

అవినీతి బీజేపీ సీఎంలపై సీబీఐ విచారణ ఎందుకు జరిపారన్నారు. మోదీ తెలంగాణకు ప్రాజెక్టులు ఇస్తారంటే ఎందుకు వద్దంటామన్నారు

# ప్రకృతి వైద్యాన్ని ప్రోత్సహిస్తున్నాం...

**మొదటిపేజీ తరువాయి..**

వారికి అతి తక్కువ ఖర్చుకే ఉత్తమ వైద్యం అందించేందుకు నేచర్ క్యూర్ దవాఖాన సిద్ధంగా ఉంది. హెల్త్‌హబ్ హైదరాబాద్‌లో చికిత్స పొందేందుకు దేశ విదేశాల నుంచి ఇక్కడికి పేషెంట్లు వస్తుంటారు. ఆయుష్ వైద్యం పొందేందుకు సైతం ఇక్కడి వచ్చేలా ఎదుగాలని కోరుతున్నా' అని మంత్రి హరీశ్ రావు అన్నారు. 'ప్రకృతితో వైద్యం, పంచ భూతాలతో వైద్యం.. అదే ప్రకృతి వైద్యం. అదే నేచురోపతి. ఇది పూర్తి భారతీయ వైద్య సిద్దాంతం. ఆయుర్వేదం, నేచురోపతి, యోగా, హోమియోపతి, యునాని, సిద్ధ అని ఉంటాయి. ఇక్కడ నేచురోపతి, యోగా విధానాలు అందిస్తున్నారు. నేచురోపతి అనేది పూర్తిగా డ్రగ్ లెస్ హీలింగ్ సిస్టం. ఔషధ రూపంలో ఆహారాన్ని, యోగా, ప్రాణాయామంను శరీరానికి అందించడం ప్రత్యేకం. శరీరాన్ని డిటాక్సిఫికేషన్ చేయడం నేచర్ క్యూర్ విధానం. ఆయుష్ వైద్యంలో నేచురోపతికి ప్రత్యేక స్థానం ఉంది. పూర్తి నేచురల్ పద్ధతిలో దీర్ఘకాలిక రోగాలకు సైతం చికిత్స అందిస్తారు. డయాబెటిస్, బీపీ, ఆర్థరైటిస్, మోకాళ్ల నొప్పులు, పీసీఓడీ, నడుం నొప్పులు, పెరాలసిస్, సయాటిక, అధిక బరువు, థైరాయిడ్, డిస్క్ సమస్యలు, సోరియాసిస్ ఇలా అనేక దీర్ఘకాలిక వ్యాధులకు సైతం చికిత్స ఉంటుంది. సౌర చికిత్స, ఫిజియోథెరపీ, జల చికిత్స, మర్దన చికిత్స, మట్టి చికిత్స ఇలాంటివి చాలా ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు లక్ష్యాలు ఏర్పాటు చేసుకొని నిరంతరం శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. తీవ్రమైన ఒత్తిడి, లైఫ్ స్టయిల్ డిసీజెస్, ఇతర ఆరోగ్య సమస్యలతో సతమతవుతున్న వారికి నేచర్ క్యూర్ దవాఖాన స్వాగతం పలుకుతున్నది. ఒక విహార ప్రాంతానికి వచ్చినట్లు ఇక్కడికి వచ్చి మంచి ప్రకృతి చికిత్స పొందవచ్చు. ఏ నొప్పి వచ్చినా, జ్వరం వచ్చినా తక్షణ ఉపశమనం కోసం వైద్యుల సలహా తీసుకోకుండా ఇష్టం వచ్చినట్లు మందులు వాడుతుంటారు. అయితే దీని వల్ల అనేక సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. కానీ నేచర్ క్యూర్ చికిత్సలో అలాంటి మాట వినిపించదు. ఇన్ పేషెంట్‌గా ఉన్నవారికి సైతం మంచి భోజనం అందిస్తారు. వారి రోగాలకు సంబంధించిన చికిత్సలో భాగంగా ప్రత్యేక ఆహారం అందిస్తారు. పూర్తి హైజీన్‌తో, నూనెలు, మసాలాలు, ఉప్పు, కారాలు లేకుండా ఉంటుంది. జ్యూస్, సలాడ్



వంటివి సమయానికి అందిస్తారు. బరువు తగ్గాలనుకున్న వారికి, ఇతర రోగాలున్న వారికి పత్యేకంగా లిక్విడ్ డైట్ సైతం అందిస్తారు. 1949 స్థాపించిన ఈ ప్రకృతి చికిత్సాలయం, ప్రకృతి వైద్య రంగంలో దేశానికే ఆదర్శంగా ఉంది. దీనికి అనుబంధంగా ఉన్న వైద్య కళాశాలలో చదువుకున్న వారు దేశంలోని ప్రసిద్ధ ప్రకృతి చికిత్సాలయాల్లో పని చేస్తుండటం మనకు గర్వకారణం అన్నారు. అయితే ఘన చరిత్ర గల ఈ దవాఖానను ఉమ్మడి పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేశారు. కనీస సదుపాయాలు కూడా కల్పించకుండా నిర్వీర్యం చేశారు. ప్రకృతి వైద్యానికి తెలంగాణ కేరాఫ్ అడ్రస్‌గా నిలిపేలా ప్రయత్నం చేస్తున్నామని, సనాతన భారతీయ వైద్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో 834 ఆయుష్ డిస్పెన్సరీలు, 5 కాలేజీలు, 4 రీసెర్చ్ హాస్పిటల్స్ ఉన్నాయి. వికారాబాద్, భూపాలపల్లి, సిద్ధిపేటలో 50 పడకల కొత్త ఆయుష్ ఆసుపత్రుల నిర్మాణాలు జరుగుతున్నాయని వెల్లడించారు. నేచర్‌క్యూర్ హాస్పిటల్ అంటే చాలా మందికి కరోనా రోజుల్లో ఈ దవాఖాన అందించిన క్వారెంటైన్ సేవలు గుర్తుకువస్తాయన్నారు. కరోనా సమయంలో అయిన వారు సైతం దూరంగా ఉండగా.. నేచర్ క్యూర్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది బంధువుల్లా అక్కున చేర్చుకున్నారని తెలిపారు. 8 వేలకుపైగా కరోనా పాజిటివ్ పేషెంట్లకు క్వారెంటైన్ సేవలు అందించిందని, 30 వేలకుపైగా ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించిందని చెప్పారు. కరోనా వంటి క్లిష్టసమయంలో అద్భుతమైన సేవలు అందించిన నేచర్ క్యూర్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బందిని అభినందించారు. నేచర్ క్యూర్ ఆసుపత్రి అభివృద్ధి కోసం, ఉత్తమ ప్రకృతి చికిత్స అందిస్తున్న రాష్ట్రాల్లో మా వైద్య బృందం పరిశీలనకు సైతం వెళ్లింది. అధ్యయన నివేదిక మేరకు ప్రకృతి వైద్యంలో నంబర్.1గా నిలిపేలా అభివృద్ధి చేస్తున్నాం.

నేచర్ క్యూర్ ఆసుపత్రికి మంచి పేరు ఉంది. ప్రతి సంవత్సరం 3 వేల మంది ఇన్ పేషెంట్లు, 10 వేల మంది ఔట్ పేషెంట్లకు పైగా చికిత్స పొందుతున్నారు. పేషెంట్ల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కాటేజీల కోసం బుక్ చేసుకోవాలంటే కనీసం నెల రోజుల ముందు బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు ఇక్కడ చికిత్స పొందుతున్నారని మంత్రి హరీశ్ రావు వెల్లడిచారు. 1949లోనే ఈ దవాఖానను ఏర్పాటు చేశారని, అయితే ఆదరణకు నోచుకోక, నాటి ప్రభుత్వాలు పట్టించుకోక పేషెంట్లు ఇబ్బంది పడేవారని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో మంత్రి హరీశ్ రావు ఈ హాస్పిటల్‌ను అద్భుతంగా తీర్చదిద్దారని, ప్రైవేటుకు ధీటుగా దీనిని అభివృద్ధి చేయడం గొప్ప విషయమన్నారు. దీంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ దవాఖానలను బాగా అభివృద్ధి చేశారని వెల్లడించారు. ఏదైనా రోగం వస్తే వందలో 80 మంది సర్కారు దవాఖానకే వస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ దవాఖానల్లో డెలివరీలు 62 శాతం పెరిగాయని స్పీకర్ పోచారం అన్నారు.

# అవినీతి పరులను శిక్షించాలా... వద్దా...

**మొదటిపేజీ తరువాయి..**

తీరును ప్రధాని మోడీ విమర్శించారు. తెలంగాణ కొందరి గుప్పిట్లో అధికారం మగ్గుతోందని మండిపడ్డారు. కుటుంబ పాలనకు విముక్తి కలగాలని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వం వల్ల ప్రజలకు ఎంతో నష్టం జరుగుతుందని.. అదే నా బాధ, ఆవేదన అన్నారు. మేం ప్రజల కోసం పని చేస్తుంటే.. కొందరు మాత్రం అవినీతికే పనులు చేస్తున్నారని రాష్ట్ర పాలనపై విమర్శలు, ఆరోపణలు చేశారు. ప్రతి ప్రాజెక్టులో కుటుంబ సభ్యుల ఆసక్తి తప్ప మాత్రమే ఉందని.. ప్రజల ప్రయోనాలు చూడట్లేదన్నారు. అవినీతి, కుటుంబ పాలన వేర్వేరు కాదని.. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలా.. వద్దా అంటూ ప్రజలను ప్రధాని మోడీ ప్రశ్నించారు . కుటుంబ పాలకులే అన్నింటిపైనా కంట్రోల్ కోరుకుంటారని.. అలాంటి వారి వల్ల ప్రజలకు నష్టమన్నారు. అలాంటి వ్యక్తుల నుంచి తెలంగాణను



కాపాడాల్సిన అసవరం ఉందా లేదా అంటూ ప్రజలను ప్రశ్నించారు. అవినీతిపై పోరాడాలా వద్దా.. అవినీతిని తరిమి కొట్టాలా వద్దా.. తెలంగాణ ప్రజలు చెప్పాలంటూ పిలుపునిచ్చారు. అవినీతి చిట్టా బయటకు వస్తుందనే భయంతోనే విపక్షాలు అన్నీ కోర్టుకు వెళ్లాయన్నారు. అవినీతిపరులపై పోరాటానికి తెలంగాణ ప్రజల సహకారం కావాలని మోడీ కోరారు. బీజేపీని అశీర్వదిస్తే రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో కేంద్రం చేపడుతున్న అనేక ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనివల్ల



ప్రాజెక్టుల పనులు ఆలస్యం అవుతున్నాయని.. దీనివల్ల ప్రజలకు ఎంతో నష్టం జరుగుతుందని మోదీ చెప్పారు. అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించొద్దని ఆయన అన్నారు. రాష్ట్రంలో కుటుంబం పాలన అవినీతిని పెంచిపోషిస్తుందన్నారు. తెలంగాణ ఏర్పడినప్పుడే కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం కూడా వచ్చిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యతను కేంద్రం తీసుకుందన్నారు. కేంద్రం చేపడుతున్న అభివృద్ధి పనులపై కొందరు వ్యక్తులు భయాందోళనలు చెందుతున్నారని విపక్ష పార్టీలపై విమర్శనాస్త్రాలు సంధించారు ప్రధాని మోదీ. వారసత్వ రాజకీయాలు.. అవినీతే వారికి ప్రాధాన్యమని ఎద్దేవా చేశారు ప్రధాని. ఇలాంటి వారికి దేశాభివృద్ధి పట్టదని.. స్వార్థపూరిత ఆలోచనలోనే మునిగి తేలుతుంటారని విమర్శించారు మోదీ. ఇలాంటి వారితో నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతకుముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ చేరుకున్నారు. సికింద్రాబాద్ లో జెండా ఊపి సికింద్రాబాద్-తిరుపతి వందే భారత్ రైలను జెండా ఊపి ప్రారంభించారు. అలాగే 720కోట్ల రూపాయలతో కేంద్రం చేపట్టిన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనులకు ప్రధాని నరేంద్రమోడీ.. శంకుస్థాపన చేసారు. బీబీనగర్ ఎయిమ్స్‌లో ఆధునిక భవనాల నిర్మాణాలకూ.. పరేడ్‌గ్రౌండ్ నుంచే శంకుస్థాపన చేసారు.




వాటి నమూనాలను కూడా అక్కడే పరిశీలించారు. 13 ఎంఎంటీఎస్ రైలు సేవలను కూడా వర్చువల్‌గా ప్రారంభించారు. ఏపీ, తెలంగాణను కలుపుతూ మరో వందే భారత్ ట్రైన్ ను ప్రారంభించామని ప్రధాని మోడీ అన్నారు. భాగ్యలక్ష్మి నగరాన్ని వెంకటేశ్వర స్వామి నగరంతో కలిపామని అన్నారు. సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన సభలో మోడీ పాల్గొన్నారు. సోదరి సోదరి మణులకు అంటూ తెలుగులో స్పీచ్‌ను స్టార్ట్ చేశారు మోడీ. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. గడిచిన 9 ఏళ్లలో 70 కిమీ మెట్రో నెట్ వర్క్ నిర్మించామని తెలిపారు. తెలంగాణను అభివృద్ధి చేసే అదృష్టం తనకు దక్కిందన్నారు. జాతీయ రహదారులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోడీ హామీ ఇచ్చారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వరంగల్ లో టెక్స్ టైల్ పార్క్ ను స్టార్ట్ చేస్తున్నామని మోడీ తెలిపారు. అంతకుముందు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో వందేభారత్ రైలును ప్రారంభించిన మోడీ.. తెలంగాణలో 6 జాతీయ రహదారుల నిర్మాణం, బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణం సహా రూ.11,300 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అలాగే సికింద్రబాద్ మహబూబ్ నగర్ విద్యుదీకరణతో పూర్తైన డబ్లింగ్ లైన్ ను మోడీ జాతికి అంకితం చేశారు. ప్రధాని మోడీ పర్యటన నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతోపాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించి పలు రూట్లలో వాహనాలను మళ్లించారు.

### 14 వందే భారత్ రైళ్లలో రెండు మనకే

**మొదటిపేజీ తరువాయి..**

చాలా రకాల మౌలిక వసతులు కల్పించేందుకు ప్రధాని మోడీ హైదరాబాద్ వచ్చారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. తెలంగాణలోని ప్రతి హిందూవు ఎప్పుడో ఒకసారి తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకోవాలని అనుకుంటారు. వారి సౌకర్యార్థం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి తిరుపతి వరకూ వందే భారత్ రైలును మోడీ అంకితం చేశారని అన్నారు. రూ.700 కోట్ల ఖర్చుతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను వచ్చే 40 ఏళ్ల వరకూ ప్రయాణికుల రద్దీకి సరిపోయేలా అభివృద్ధి చేస్తున్నాం. మహబూబ్ నగర్ కు ఇప్పటి వరకు సింగిల్ లైన్ మాత్రమే ఉంది. . దీనికి రాష్ట్ర ప్రభుత్వ సహకారం లేదు. మేమే ప్రధాని మోడీని అడిగి నిధులు తీసుకొచ్చాం అని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అన్ని రాష్ట్రాలు సమానమే అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. లక్ష కోట్లకు పైగా తెలంగాణకు జాతీయ రహదారుల నిర్మాణాలకు ప్రధాని మోడీ నిధులు ఇచ్చారని చెప్పారు. తెలంగాణ ప్రజలకు ఎంతో లాభం చేశారని, రాష్ట్ర ప్రజలు మోడీకి మద్దతు తెలపాలని కోరారు.

తెలంగాణ, ఏపీకి రెండు వందే భారత్ ట్రైన్స్‌ను అందిస్తున్నామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. వరల్డ్ క్లాస్ స్టేషన్ గా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. కేంద్ర రైల్వేబ్జడెట్ లో తెలంగాణకు నాలుగువేల కోట్లు కేటాయించామన్నారు. 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్' పేరుతో దేశాన్ని ప్రధాని అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు.

ప్రధాని కార్యక్రమంలో గవర్నర్ తమిళసై, కేంద్రమంత్రులు వైష్ణివీ అశ్విన్, కిషన్ రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జనగామ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. సుగుణాకర్ రాజుకు సన్మానం

**జనగామ ఏప్రిల్ 08 (ప్రజామంటలు):** ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో బిఎఫ్ హెచ్ఐ అక్రిడేషన్ వచ్చిన సందర్భంగా రాష్ట్ర అంబేద్కర్ ప్రజాసంఘాల నాయకులు గజ్జల కాంతం గంధం రాములు గజరాజు చందు ఆధ్వర్యంలో అంబేద్కర్ 125 అడుగుల



విగ్రహం ముందు జనగామ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుగుణాకర్ రాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం మొత్తంలో అన్ని రాష్ట్రాల కంటే ముందుగా మన రాష్ట్ర గౌరవాన్ని సీఎం కేసీఆర్ దిశా నిర్దేశంలో హరీష్ రావు ఆధ్వర్యంలో కీర్తిని దేశమంతా చాటినందుకు చాలా గర్వంగా ఉందని అన్నారు. సుగుణాకర్ రాజు, సిబ్బందికి చేస్తున్న కృషికి అభినందించారు.

## మహాత్మాజ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల కమిటి
# కోఆర్డినేటర్‌గా బిసి నేత కొత్తపల్లి అభినాష్



**జనగామ ఏప్రిల్ 08 (ప్రజామంటలు):** ఈనెల 11న మహత్మాజ్యోతిరావు పూలే 197వ జయంతి సందర్బంగా తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే జయంతి ఉత్సవాల కమిటిలో కోఆర్డినేటర్ గా బిసి నేత కొత్తపల్లి అభినాష్ ను ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద నాయిబ్రాహ్మణ మంగళ సామాజిక వర్గానికి చెందిన తమకు ఈ గొప్ప అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కేసిఆర్, మంత్రులు కేటిఆర్, గంగుల కమలాకర్ బిసి కమిషన్ సభ్యులు కిషోర్ కుమార్ గౌడ్, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




జనగామ పట్టణంలో రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించిన కె. ఎం. జాన్. పాల్గొన్న స్థానిక కాపరి రెవ. ఫిలిప్, రెవ.మోజెస్, కర్రోళ్ల జాన్, బక్క శ్రీను, ప్రెస్టన్ ఇన్స్టిట్యూట్ కరెస్పాండంట్ బక్క ప్రవీణ్ కుమార్, డి. జేమ్స్.

# ప్రధాని మోడీ సభకు జనగామ జిల్లా నుండి తరలిన బిజెపి శ్రేణులు

**జనగామ ఏప్రిల్ 08 (ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ పరేడ్ గ్రౌండ్లో జరుగు బహిరంగ సభకు జనగామ జిల్లా నుండి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో బిజెపి జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని



కుట్రలు కుతంత్రాలు చేసిన తెలంగాణలో బిజెపి ఎదుగుదలను ఎవరు ఆపలేరని అవినీతి ప్రభుత్వాన్ని అంత మొందిస్తారని, తెలంగాణలో కమలం వికసిస్తుందని, తెలంగాణలో బిజెపితోనే అభివృద్ధి సాధ్యమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో కన్వీనర్ కొంత శ్రీనివాస్, జనగామ ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు గుజ్జుల నారాయణ, జనగామ మండల అధ్యక్షులు తిరుపతి యాదవ్, నర్మెట్ట మండల అధ్యక్షులు రాజు నాయక్ మధు, మహేష్, రవి, దినేష్, నవీన్, రాంకోటి నాయక్ పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాలను సందర్శించిన
# పోలీస్ కమిషనర్ ఏ.వీ. రంగనాథ్

**హనుమకొండ ఏప్రిల్ 08 ( ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు ట్రైనీ పోలీస్ సబ్ ఇన్ స్పెక్టర్ ఉద్యోగ నియామకాలకు సంబంధించి తుది పరీక్ష



జరుగుతున్న పరీక్షా కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ. రంగనాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో పోలీస్ బందోబస్తు, పరీక్ష జరుగుతున్న తీరుపై పోలీస్ కమిషనర్ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేశారు.

# సిపిఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన రావాలి

- **అప్పుడే కార్డియా మరణాలు నియంత్రించవచ్చు**
- **ఆకస్మిక గుండెపోట్ల నుండి ప్రజలను రక్షించేందుకు**
- **అన్నిస్థాయిలకు చెందిన పోలీసులకు సిపిఆర్ పై శిక్షణ**
- **జిల్లా ఎస్పీ భాస్కర్**

**జగిత్యాల ఏప్రిల్ 08 (ప్రజామంటలు):** క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సిపిఆర్ (హృదయ శ్వాసకోశ పురర్జీవనచర్య) పై శిక్షణ పొందడం ద్వారా కొంతమేర గుండెపోటు మరణాలను నియంత్రించే అవకాశం ఉంటుందని జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. శనివారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులకు సిబ్బందికి సిపిఆర్ పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని జిల్లాల్లో సి పి ఆర్ పై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని అందులో భాగంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులకు, సిబ్బంది కి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు. ఇటీవల కార్డియా అరెస్టుతో పలువురు యువకులు ఆకస్మిక మృతి చెందడం చాలా బాధాకరమైన దీని ద్వారా ఎవరు మృతి చెందకూడదు అనే ఉద్దేశంతో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందికి శిక్షణ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. సిపిఆర్ పై ప్రతి ఒక్కరికీ అవగాహన వచ్చినప్పుడే కార్డియా మరణాలు చాలా వరకు నియంత్రణలోనికి వస్తాయని అన్నారు. ఆకస్మిక గుండెపోట్లు సంభవించిన సందర్భాల్లో సిపిఆర్ విధానం ద్వారా గుండెకు రక్తప్రసరణం అందడం, నోటిద్వారా ఆక్సిజన్ అందించడం వల్ల గుండె పనిచేయడం ప్రారంభించి ప్రమాదానికి గురైనవారిని రక్షించవచ్చని తెలిపారు. నిత్యం ప్రజల మధ్యఉండే పోలీసులకు ఆకస్మిక గుండెపోట్లు సంభవిం చిన వ్యక్తులు తారసపడే అవకాశం ఉన్నదందున, అన్నిస్థాయిలకు చెందిన పోలీసులు పూర్తిస్థాయిలో శిక్షణ పొందినట్లయితే అలాంటి వ్యక్తుల ప్రాణాలను రక్షించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. గుండెపోటు వచ్చిన వారికి ఆన్ ది స్పాట్ సిపిఆర్ చేయడం వల్ల వారి యొక్క ప్రాణాలను కాపాడడం జరుగుతుంది ఈ యొక్క సిపిఆర్ చేసే కాలాన్ని గోల్డెన్ హవర్ గా భావించడం జరుగుతుందని అన్నారు. సర్వేల ప్రకారం గుండెపోటు సంభవించినప్పుడు సిపిఆర్ చేయడం ద్వారా 60% ప్రాణాన్ని కాపాడవచ్చు అని అన్నారు. పోలీస్ సిబ్బంది లో ముఖ్యంగా ట్రాఫిక్ విధులు, బ్లూ కోట్ , పెట్రో కార్ విధులు నిర్వహిస్తున్న






సిబ్బందికి ఈ యొక్క సి పి ఆర్‌పై ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని పోలీస్ మరియు వైద్య శాఖ వారి సహాయంతో విడతల వారీగా జిల్లాలో ఉన్న ఆటోడ్రైవర్లకు, హోటల్లో పనిచేసే సిబ్బంది, పెట్రోల్ బంక్ లో పనిచేసే వారికి ఈ శిక్షణ ఇవ్వడం ద్వారా కార్డియా మరణాలు చాలా వరకు నియంత్రణలోనికి వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ ప్రకాష్ , డిప్యూటీ డి ఎం/ హెచ్ఓ శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్స్ శ్రీకాంత్, రవిశంకర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు వామనమూర్తి, నవీన్, టౌన్ ఇన్స్పెక్టర్ కిషోర్, ఎస్.ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో మోడీ సభ

- **తరలి వెళ్లిన జగిత్యాల జిల్లా బిజెపి నాయకులు**

**జగిత్యాల ఏప్రిల్ 08 (ప్రజా మంటలు)** హైదరాబాద్ నుండి తిరుపతికి వెళ్లే వందే భారత్ రైలు ప్రారంభంతో పాటు పలు అభివృద్ధి పనుల పునరుద్ధరణకు హైదరాబాద్ విచ్చేస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ సభకు జగిత్యాల జిల్లా కేంద్రం నుండి బిజెపి నాయకులు కార్యకర్తలు శనివారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ చిలకమర్రి మదన్మోహన్ తదితరులు మాట్లాడుతూ.... భారత ప్రజల ఆశాజ్యోతి నరేంద్ర మోడీ హైదరాబాదు నుండి తిరుపతికి వందే భారత్ రైలు ప్రారంభించడంతో పాటు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనులు అదేవిధంగా బీబీనగర్ ఎయిమ్స్ పనుల పునరుద్ధరణ జాతీయ రహదారుల అభివృద్ధి పనుల పునరుద్ధరణకు విచ్చేస్తున్న సందర్భంగా తాము ప్రధాని సభకు జగిత్యాల జిల్లా నుంచి తరలి వెళ్తున్నామని తెలిపారు. ప్రజలు మోడీ సభలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మోడీ పర్యటనకు తరలివెళ్లిన బిజెపి నాయకులు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కొక్కుగంగాధర్, బీర్పూర్ మండలం ఇంచార్జ్ పడాల తిరుపతి, బీర్పూర్ మండల అధ్యక్షులు మ్యాడ జనార్దన్, పట్టణ అధ్యక్షులు వీరభత్తిని అనిల్ కుమార్, యువమోర్చా జిల్లా అధ్యక్షులు రెంటం జగదీష్, రామాజీపేట ఎంపీటీసీ ఆకుల మహేష్, రాయికల్ పట్టణ శాఖ అధ్యక్షులు కల్లెడ ధర్మపురి, కురుమ మల్లారెడ్డి, దీటి వెంకటేష్, మెరుగు ఉమేష్, జిల్లా కార్యాలయ కార్యదర్శి నలువాల అశోక్, ఆముద రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల మార్కండేయ, బందెల గంగరాజం,



జగిత్యాల దళిత మోర్చా అధ్యక్షులు నక్క జీవన్, ఓబిసి మోర్చా జిల్లా నాయకులు శ్రీనివాస్ గజేందర్ రాయికల్ మండలం గిరిజన మోర్చా అధ్యక్షులు తిరుపతి నాయక్, శ్రీరామ్ గౌడ్, కూస శ్రీనివాస్, గాజంగి విష్ణు, లక్ష్మణ్, యువ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి కురుమ రమేష్, ఆడెపు రమేష్, పర్వతం వెంకటేష్, ఉయ్యాల స్వామి, జున్ను సంతోష్, పవన్, అబ్బాడి సోమేశ్వర్, కళ్యాణ్ బాబు తదితరులు తరలి వెళ్లారు.

# ఇందుర్తిలో బ్రహ్మంగారి చరిత్ర ప్రదర్శన

**చిగురుమామిడి ఏప్రిల్ 08 (ప్రజామంటలు):** చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో కాలజ్ఞానకర్త శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి జీవిత చరిత్ర నాటక ప్రదర్శన గ్రామ కళాకారులచే ప్రదర్శింపబడుతుంది. రెండు రోజులుగా జరిగే ఈ కార్యక్రమానికి మొదటి రోజు గ్రామ సర్పంచ్ అందె స్వరూప స్వామి కరీంనగర్ జిల్లా కళాకారుల కమిటీ అధ్యక్షులు వంగ సుధాకర్ కోశాధికారి బొల్లా కొమురయ్య మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్ లు హాజరయ్యారు. ఎలాంటి లాభా పేక్ష లేకుండా సమాజ హితం కోసం పాటుపడుతున్న కళాకారులను అభినందిస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్క కళాకారునికి జిల్లా కమిటీ పక్షాన అధ్యక్షుడు వంగ సుధాకర్ ప్రశంస పత్రాలు అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి అందే స్వామి, ఉప సర్పంచ్ తోట సతీష్, లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు గాదె రఘునాథరెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, అందే చిన్న స్వామి, వార్డు సభ్యులు చెల్పురి విష్ణుమాచారి డాక్టర్ రాజేందర్ జిల్లా మరియు మండల బాధ్యులు చందబోయిన పరశురాములు, గట్టు మొగిలి, బింగి లక్ష్మీనారాయణ కుతాడి కొమురయ్య, సోన్నాయిల భరత్, కల్వాల చంద్రారెడ్డి, అన్నాడి మల్లికార్జున్ రెడ్డి, సంపత్, అంజయ్య, రాములు, కొమురయ్య, రాజయ్య, తిరుపతి, రవీందర్, కుమారస్వామి, చంద్రయ్య, రమేష్ , శ్రీనివాస్, రాజు, శంకర్, పోచయ్య, కిష్టయ్య, సంపత్, తదితరులతోపాటు కరీంనగర్, మన్నంపెల్లి గాగిరెడ్డిపల్లి, సుందరగిరి, కొండాపూర్, ఓబులాపూర్, చిగురుమామిడి, నారాయణపూర్ , గొట్లమిట్ట, లంబాడిపల్లి తదితర గ్రామాల కళాకారులు పాల్గొన్నారు.





# ప్రధాని మోడీని కలిసిన బీజేపీ నేత రాజశేఖర్ రెడ్డి

**సికింద్రాబాద్, ఏప్రిల్ 08 ( ప్రజామంటలు ):** సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన బహిరంగ సభకు విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోడీని సికింద్రాబాద్ భారతీయ జనతా పార్టీ పార్లమెంటరీ కన్వీనర్ తడిసిన రాజశేఖర్? రెడ్డి కలుసుకొని ఘన స్వాగతం పలికారు. ప్రధాని మోడీని శాలువాతో రాజశేఖర్ రెడ్డి సత్కరించారు. ప్రధాని మోడీతో కాసేపు రాజశేఖర్ రెడ్డి ముచ్చటించారు.



## మోడీ పర్యటన,
# కాంగ్రెస్ నేతల అరెస్ట్

**సికింద్రాబాద్ ఏప్రిల్ 08 (ప్రజామంటలు):** ప్రధానమంత్రి నరేంద్రమోడీ సిటీ పర్యటన నేపధ్యంలో శనివారం సికింద్రాబాద్ ప్రాంతంలోని పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు



ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ లకు తరలించారు. సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గంట రాజు సాగర్ ఇంటికి వెళ్ళిన పోలీసులు ఆయన్ని కొద్దిసేపు గృహనిర్బంధం చేసి, అనంతరం తుకారం గేట్ పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్ళారు. ఈసందర్బంగా గంట రాజు సాగర్ మీడియాతో మాట్లాడుతూ....ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని, ప్రభుత్వం తమను అణచివేయాలనే ఉద్దేశ్యంతో అరెస్ట్ చేయడం తగదన్నారు.

# ప్రధాని మోడీ బహిరంగ సభ
## తరలిన బన్సీలాల్ పేట బీజేపీ శ్రేణులు

**సికింద్రాబాద్ ఏప్రిల్ 08 (ప్రజామంటలు):** సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లోని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ బహిరంగ సభకు సనత్ నగర్ నియోజకవర్గం బన్సీలాల్ పేట డివిజన్ నుంచి బీజేపీ



నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్ళారు. మాజీ మంత్రి , మాజీ ఎన్.డీ.ఎమ్.ఏ వైస్ ప్రెసిడెంట్ మర్రి శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో సనత్ నగర్ నుంచి నాయకులు బైక్ లపై ర్యాలీగా పరేడ్ గ్రౌండ్ కు వెళ్ళారు. దారి వెంట జై మోడీ...జైజై మోడీ ..అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. బీజేపీ నాయకులు గుంటి సత్యనారాయణ, సగత్వాళ్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

# విభజన హామీలు అమలు చేయాలి

**జగిత్యాల ఏప్రిల్ 08 (ప్రజామంటలు):** సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు జగిత్యాల జిల్లా సిపిఐ సమితి ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ చౌరస్తాలో కండ్లకు నల్ల బ్యాడ్జీలు ధరించి, విభజన హామీలు వెంటనే అమలు చేయాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా




జిల్లా కార్యదర్శి వెన్న సురేష్ మాట్లాడుతూ.... 2014 విభజన హామీలు అమలు చేయడంలో కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విఫలమైందని హామీలు నెరవేర్చకుండా కుంటి సాకులు చెప్పడం అన్యాయమని అన్నారు. సింగరేణి ప్రైవేటీకరణకు మళ్లీ టెండర్లు పిలవడం ఏంటి అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను తెచ్చిందని భారత రాజ్యాంగ స్ఫూర్తిగా సోషలిజం, సర్కులరిజం నీరు కార్చే ప్రయత్నం చేస్తుందని దుయ్య బట్టారు. జాతీయ సంపద అయినా ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని లాంటి మోసపూరిత కార్పొరేట్లకు అప్పగించడం అన్యాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొక్కుల శాంత, కోరు కంటి శ్రీనివాస్, ఎండి అక్రమ్, మాడిశెట్టి కిరణ్, ప్రకాష్, సంజీవ్, సాయి రెడ్డి, వినోద్, సామాద్, వెన్న మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిబాపూలే జయంతి ఉత్సవ కమిటి
## జిల్లా కో కన్వీనర్‌లుగా గోపికృష్ణ, రాజేంద్ర ప్రసాద్

**జగిత్యాల ఏప్రిల్ 08 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏటా ఏప్రిల్ 11న ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహాత్మ జ్యోతిబాపూలే 197 జయంతి ఉత్సవ కమిటీని శనివారం జిల్లా



పాలనాదికారి యాస్మిన్ భాషా ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి శికారి గోపి కృష్ణ , రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తుమ్మనపెల్లి రాజేంద్రప్రసాద్ లను ఉత్సవ కమిటీ కో కన్వీనర్ లుగా వీరిని నియమించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో జిల్లా బి సి సంక్షేమశాఖాధికారి సాయి బాబా, రాష్ట్ర బీసీ నాయకులు ముసిపట్ల లక్ష్మి నారాయణ, హరి అశోక్ కుమార్, శ్రీహరి బ్రహ్మాండబెరి నరేష్, జాజాల రమేష్, తొగిటి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు. మా నియామకానికి కృషి చేసిన అధికారులకు, కమిటీ సభ్యులకి ధన్యవాదాలు తెలిపారు.

# సింగరేణి.... మరో విశాఖ ఉక్కు కారాదు!

సింగరేణి ప్రైవేటీకరణకు కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం అవుతున్న వేళ ..ప్రధాని మోడీ రాకను పురస్కరించుకుని ..సింగరేణిలో మహాధర్నాకు అధికార బిఆర్ఎస్ పిలుపునివ్వడంతో ధర్నాలు చేపట్టారు. ఎక్కడిక్కడన నిరసనలు సాగాయి. మోడీ వ్యతిరేక నినాదాలు మిన్నంటాయి. సింగరేణిని బతికించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు తరహాలో..సహాయక పనులను నిరాకరించడం ద్వారా ప్రైవేటీకరణకు కుట్రలు చేస్తున్నారని మంత్రి కెటిఆర్ తదితరులు మండిపడుతున్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై ఇప్పటికే ఆందోళనలు కొనసాగుతున్నాయి. అయినా కేంద్రం వెనక్కి తగ్గడం లేదు. ఉక్కు ఫ్యాక్టరీని తుక్కుగా అమ్మేస్తున్నారు. కోట్లాది విలువైన భూములను అప్పగించేస్తున్నారు. ఇంతకన్నా సిగ్గు మాలిన పని మరోటి ఉండబోదు. ఎపిలోని జగన్ ప్రభుత్వం కూడా దీనిని అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు. ఎందుకంటే ఎపిలో అనేక ప్రాజెక్టులను ఆదానీకి అప్పగించడంలో జగన్ ముందున్నారు. ఇలాంటి తరుణంలో తనకు తిరుగులేక పోవడంతో మోడీ విశాఖ ఉక్కు గొంతు పిసికేస్తోంది. దీనికి వ్యతిరేకత లేకపోవడంతో ఇప్పుడు సింగరేణిపైనా అదే తరహా కుయుక్తులు పన్నుతున్నారని తెలంగాణ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. నిజంగానే సింగరేణిని ప్రైవేటీకరించడం లేదని..గతంలో రామగుండం పర్యటనలో ప్రధాని స్వయంగా ప్రకటించారు. అయినా తెలంగాణ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. నిజంగానే ఇందులో నిజం ఉందా లేదా అన్నది బిజెపి నేతలు వెల్లడించారు. సింగరేణి బొగ్గు గనులను ఆదానీకి అప్పగించే కుట్ర సాగుతోందని అంటున్నారు. ఇది నిజమే అయితే ..ఆదానీకి అండగా మోడీ ఉన్నాడన్నది నూటికినూరుపాళ్లు ఖచ్చితంగా నమ్మాల్సిందే. సింగరేణిని ప్రైవేటీకరిస్తే..నిజంగానే ఇది మోసం చేసినట్లుగానే




భావించాలి. అయితే ఇందులో బిఆర్ఎస్ చెప్పేది నిజమా లేక..కేంద్రం చెప్పేది నిజమా అన్నది తేలాల్సి ఉంది.సింగరేణి విద్యుత్ ఉత్పత్తిలో ముందున్నది. ఇక్కడి బొగ్గుతోనే థర్మల్ స్టేషన్ నడుస్తోంది. నిరంతర విద్యుత్‌కు ఇది ఎంతగానో తోడ్పడుతోంది. ఇలాంటి సింగరేణి చేజారితే తెలంగాణ భవిష్యత్ దెబ్బతినగలదు. ఇకపోతే కేంద్రం అనుసరిస్తున్న విద్యుత్ విధానం వల్ల నేటికీ ప్రజలకు నిరంతర విద్యుత..నాణ్యమైన విద్యుత్... చౌకయిన విద్యుత్ అందడం లేదు. ఈ విషయంలో తెలంగాణ మాత్రమే ఆదర్శంగా ఉంది. తెలంగాణలో ఎంత కష్టమయినా కెసిఆర్ నిరంతర విద్యుత్ అందిస్తున్నారు. కానీ నేటికీ కేంద్రం విద్యుత్ విధానం సమగ్రంగా లేదు. వేలాది గ్రామాలు నేటికీ విద్యుత్ కోసం ఎదురు చూస్తున్నాయి. నిరంతర విద్యుత్ అన్నది మిథ్యగా మారింది. ఈ క్రమంలో ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీలను (డిస్కామ్) గట్టెక్కించే పేరుతో షరతులతో కూడిన పథకాలను కేంద్రం ప్రవేశపెడుతున్నది. డిస్కాముల పేరుకుపోయిన నష్టాలు, అప్పులలో అధిక భాగం రాష్ట్ర ప్రభుత్వా లు భరించటం ఈ పథకాల సారాంశం. ఆర్థిక పునర్నిర్మాణ పథకం, ఉజ్వల్ డిస్కాం ఎస్యూరెన్స్ యోజన (ఉదరు), అందరికి విద్యుత్ వంటి పథకాలను కేంద్రం ప్రతిపాదించింది. వాటిపై రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి డిస్కాములతో ఒప్పందాలపై సంతకాలు చేయించింది. ఈ పథకాల ప్రకారం ఉభయ తెలుగు రాష్ట్రాలు గత ఎనిమిదేళ్ళుగా వేలకోట్ల రూపాయల మేరకు వాటి డిస్కాముల పేరుకుపోయిన నష్టాలను, అప్పులను భరిస్తూ వస్తున్నాయి. అవసరం లేని ఆర్ఇ కొనుగోలు వల్ల విపరీతంగా మిగులు విద్యుత్ తేలి, వినియోగ దారులపై ట్రూఅప్ రూపంలో భారాలు పడుతున్నాయి. వాటిని తగ్గించేందుకు మోడీ ప్రభుత్వం ఎలాంటి సహాయం చేయటం లేదు. మిగులు విద్యుత్తుతో విద్యుత్ ప్రాజెక్టుల ఉత్పత్తి సామర్థ్యం నిరుపయోగంగా ఉన్న మేరకు రాష్ట్రాలు పిపిఎల ప్రకారం పొందని విద్యుత్‌కు స్థిర ఛార్జీలను వేల కోట్ల రూపాయల మేరకు చెల్లించాల్సి వస్తున్నది. చివరకు ఈ భారాలు వినియోగదారులపై పడుతున్నాయి. పెత్తనం కేంద్రానిది.. అధిక లాభాలు ఆశ్రిత పెట్టుబడిదారుల కార్పొరేట్ సంస్థలకు అన్న చందంగా సాగుతోంది. విద్యుత్ రంగంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరి, విధానాల పర్యవసానాల కారణంగా విద్యుత్ అన్నది భారంగా మారుతోంది. తన విధానాలకు ప్రధాన కారణమైన మోడీ ప్రభుత్వం మాత్రం తానుగా ఇందుకు దమ్మిడీ ఆర్థిక సహాయం చేయటం లేదు. గత ఎనిమిదేళ్ళ మోడీ ప్రభుత్వ కాలంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఇచ్చిన రుణాల పారుబకాయిలు దాదాపు పదకొండు లక్షల కోట్ల రూపాయల మేరకు మాఫీ అయ్యాయి. ఇందులో అత్యధిక భాగం ప్రైవేటు కార్పొరేట్ సంస్థల బకాయిలే అని గుర్తించాలి. రాష్ట్ర ప్రభుత్వాల డిస్కామ్‌ల రుణాల బకాయిలలో ఈ విధంగా ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదన్నది కూడా మనం గమనించాలి. ఆ డిస్కమ్‌లు వాటికి విద్యుత్ సరఫరా చేస్తున్న ఉత్పత్తిదారులకు, ముఖ్యంగా ప్రైవేటు ఉత్పత్తిదారులకు, భారీగా బకాయి పడటంతో కేంద్రం అప్పులు మంజూరు చేయించేందుకు ప్రతిపాదించి, అందుకు రాష్ట్ర ప్రభుత్వాలు కౌంటర్ గ్యారంటీ ఇచ్చేందుకు షరతు విధించింది. కేంద్రానికి చెందిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, గ్రామీణ విద్యుత్ సంస్థలతో అలా మంజూరు చేయించిన రుణాల మొత్తాలను విద్యుత్ ఉత్పత్తిదారులకు నేరుగా ఆ రుణ సంస్థలతో చెల్లించేలా చేస్తోంది. డిస్కాములకు మంజూరు చేసిన ఆ సంస్థలు ఈ రుణాలపై బ్యాంకుల కన్నా ఎక్కువ వడ్డీ రేట్లు వసూలు చేస్తున్నాయి. దీనివల్ల ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తిదారుల అవసరాలు తీరుతున్నాయి. రుణాలిచ్చిన కేంద్ర ఆర్థిక సంస్థలకు లాభదాయక వడ్డీ వ్యాపారం జరుగుతున్నది. ఇలాంటి పథకాల వల్ల విద్యుత్ ఉత్పత్తిదారులకు డిస్కాముల బకాయిలు కేంద్ర రుణ సంస్థలకు చెల్లించాల్సిన రుణాల బకాయిలుగా మారుతున్నాయి. ఈ క్రమంలో సింగరేణి కూడా చేజారితో కోలుకోలేమన్న బాధను తెలంగాణ వ్యక్తం చేస్తోంది. ఇది నిరంతర విద్యుత్‌పైనా తీవ్ర ప్రభావం పగడదని వాదిస్తోంది. ఈ క్రమంలో బొగ్గుబావుల వేలంపై కేంద్రం తన వైఖరిని స్పష్టం చేయాలి. సింగరేణి ప్రైవేటీకరణపైనా స్పష్టత ఇవ్వాలి. నిరంతర విద్యుత్‌పై దేశంలో ఒక విధానాన్ని కూడా ఆమోదించాల్సి ఉంది. అదే సమయంలోవిద్యుత్ వినియోగం ప్రజలకు భారం కాకుండా చూడాల్సి ఉంది.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

–ఎడిటర్

## మనశ్శాంతి

నాగదత్తుడనే జమీందారు చాలా గర్విష్టి. జమీందారుననే అహంకారంతో మిడిసిపడేవాడు.

ఒకరోజు ఆయన చిన్ననాటి మిత్రుడు రాఘవుడు వాళ్లింటికి వచ్చాడు. రాఘవుడు ఘనవైద్యుడు. అందులోనూ పక్షవాతం వంటి నరాలజబ్బుల ప్రత్యేకవైద్యంలో దిట్ట.

నాగదత్తుడి ఇంట్లో పదిరోజులున్న రాఘవుడు వైద్యానికి సంబంధించిన ఎన్నో మెలుకువలు నాగదత్తుడికి నేర్పించాడు. అనేక



రకాల ఔషధమొక్కల్ని పరిచయం చేశాడు. వైద్యవిధానాల్ని రాసిచ్చాడు.

ఒకసారి నాగదత్తుడి చెల్లెలుభర్త శేఖరుడికి పక్షవాతంతో కాలు, చెయ్యి పడిపోయాయి. విషయం తెలిసిన నాగదత్తుడు వాళ్లూరెళ్లి బావగారికి వైద్యం చేసి పూర్తిగా నయం చేశాడు. శేఖరుడు చక్కగా లేచి తిరుగుతున్నాడు.

నాగదత్తుడి కొడుకు వినయదత్తుడు "నాన్నా!మీరు నరాలవైద్యంలో చక్కటి ప్రావీణ్యం సంపాదించారు. పక్షవాతానికి సరైనవైద్యం చేసేవారు ఈ దరిదాపుల్లో లేరు. మీకు నేర్పిన రాఘవయ్యగారు దూరదేశం వెళ్లారు. వైద్యంకోసం సుదూరప్రాంతాలకు వెళ్లలేక ప్రజలు బాధపడుతున్నారు. మీరు వైద్యసేవలందిస్తే వారి బాధలు తప్పుతాయికదా!"అన్నాడు.

అందుకు నాగదత్తుడు "నేను వైద్యం చేయడమా?ఇంట్లో వాళ్లకూ, దగ్గరిబంధువులకూ వైద్యమందించడమైతే ఏమోగానీ ఒక జమీందారునై ఊళ్లో వాళ్లకు వైద్యం చేయడమా?రాఘవుడు బతుకుదెరువుకోసం వైద్యం చేస్తున్నాడు. నాకేం తక్కువ? వీధినపోయేవాళ్ల చేతులకు,కాళ్లకు పసర్లు రాయాల్సిన ఖర్మ నాకుపట్టలేదు. సేవాభావమని మన స్థాయిని దిగదార్చుకోవటం నాకిష్టంలేదు"అన్నాడు.

వినయదత్తుడు తండ్రికి ఎంతచెప్పినా వినలేదు.చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లయింది.

కొంతకాలానికి ముసలివాడయిన నాగదత్తుడిని ఓఆలోచన కలవరపెట్టింది. 'తనకు వయసు మీరుతోంది. తనకు పక్షవాతమొస్తే వైద్యం చేసేవాళ్లెవరు? తన తర్వాత ఆవిద్య తన కుటుంబసభ్యులకు తెలియకుండా పోతుందికదా!' అన్నదే ఆ ఆలోచన.

కొడుకు వినయదత్తుడికి విషయం చెప్పి, వైద్యవిద్యను నేర్పించాడు. వినయదత్తుడు పట్టుదలగా నేర్చుకున్నాడు.

తన భవంతి సమీపంలోని సువిశాలమైన స్థలంలో వైద్యశాలఏర్పాటు చేశాడు. ఊళ్లోవాళ్లందరికీ వైద్యం అందించే వాడు. నాగదత్తుడికి కొడుకుతీరు నచ్చలేదు. జమీందారైన తనకొడుకు అందరి కాళ్లూ పట్టుకుని పసర్లు రాయడం సహించలేకపోయాడు. వద్దని మొత్తుకున్నాడు. అయినా వినయదత్తుడు తండ్రి మాటల్ని చెవికెక్కించుకోలేదు.

నరాలవ్యాధులు,పక్షవాతంతో ఎంతో మంది కదల్లేని స్థితిలో వైద్యం కోసం వస్తున్నారు. వినయదత్తుడు పేదలకు ఉచితవైద్యం అందిస్తున్నాడు. వైద్యశాలకు వచ్చేవారంతా నాగదత్తుడిని కలిసేవారు. వినయదత్తుడి గొప్పదనాన్ని ప్రశంసించేవారు. అలాంటి కుమారుడిని కన్న మీఋణం ఎన్నిజన్మలెత్తినా తీర్చుకోలేమని కృతజ్ఞతలు తెలిపేవారు.


చుట్టుపక్కల వందగ్రామాల్లో ఆయన పేరు మారుమోగింది.గతంలో నాగదత్తుని వద్ద పనిచేసేవారు,ఆయనతో అవసరమున్న వారు మాత్రమే ఆయనను గౌరవించేవారు. ఇప్పుడు నాగదత్తుడు ఎక్కడికెళ్లినా ఎనలేని గౌరవం లభిస్తోంది. వారి వంశగౌరవం పెరిగింది. తరతరాలకూ తరగని సిరిసంపదలున్నా, ఇంతకాలం నాగదత్తుడిలో ఏదో అసంతృప్తి, అశాంతి ఉండేవి.ఇప్పుడు మనసు హాయిగా, తృప్తితో, శాంతి నిండిఉంది. ఇదే విషయం కొడుకుతో అంటే "నాన్నా!తరగని సంపదలున్నంతమాత్రాన మనశ్శాంతి లభించదు. అలాంటి వారు ఎక్కడెక్కడో తిరుగుతూ, మనశ్శాంతి కోసం వెదుక్కుంటున్నారు. ఇతరులకు చేతనైనసాయం చేయటంలోనే మనశ్శాంతి, తృప్తి,జీవితానికి సార్థకత ఉన్నాయి.ఆ ఆనందం వెలకట్టలేనిది. శాశ్వతమైనది."అన్నాడు వినయంగా.

నాగదత్తుడికి తన అశాంతికి కారణం అర్థమయింది. సత్కార్యాలు చేయడంలో, మానవసేవలో తానూ పాలుపంచుకోవటానికి వైద్యశాలలోకి నడిచాడు.

– డి.కె.చదువులబాబు
9440703716

## పరమ పవిత్రం.... పునరుత్థాన దినం

ఈస్టర్ పండగ క్రైస్తవులకు పరమ పవిత్ర దినం. ఈస్టర్ ఆదివారం, ఏప్రిల్ 9, 2023న జరుపుకుంటారు. పరమ పవిత్ర బైబిల్ సంబంధిత కొత్త నిబంధన లో పేర్కొన్న ప్రకారం కల్వరిగిరిలో యేసు ప్రభువును రోమనులు శిలువ వేసి హత మార్చగా, ఖననానంతారం, మూడవ రోజున నిర్జీవితుడైన క్రీస్తు పునరుత్థానం చెందిన పవిత్ర దినాన్ని క్రైస్తవులు ఈస్టర్ పర్వ దినంగా జరుపుకుంటారు. ఈ దినాన్ని దేవుని ఎంతో అద్భుతమైన పుణ్య దినంగా భావిస్తారు. 40 రోజులపాటు ఉపవాస దీక్షలు ప్రార్థనలు, ప్రాయశ్చిత్తం ఆచరించిన సందర్భంగా జీసస్ అభిరుచికి ఉన్నత స్థితిగా పరాకాష్టగా భావిస్తారు...పునరుత్థానము/ పునరుద్ధానం అనగా క్రైస్తవ పరిభాషలో మరణించిన తర్వాత ఆత్మ రూపంలో తిరిగి లేవడం. పునరుత్థానాన్ని మరణంపై యేసు ప్రభువు గెలిచిన విజయోత్సవంగా క్రైస్తవులు ఈస్టర్ పండుగ జరుపుకుంటారు. ఈస్టర్ అనే పేరు పునర్జన్మ దేవత అయిన ఈస్టారా నుండి వచ్చిందని విశ్వసిస్తారు. ఈస్టర్ పర్వదినాన్ని ఆచరించే ఆదివారానికి ముందు




వారాన్ని పవిత్రవారంగా పరిగణిస్తారు.. క్రైస్తవులకు కు ఇది అతి పెద్ద పండుగ. ఈ పండుగ వసంత ఋతువులో వస్తుంది. ప్రధానంగా ఈస్టర్ త్రి దినాలను.... మౌండే, థ ర్స్ డే, గుడ్ ఫ్రైడే, హెూలీ సాటర్ డే గా జరుపుకుంటారు.

క్రిస్మస్ లాగా ఈస్టర్ పండుగ ప్రతి సంవత్సరం ఒకే తేదీన రాదు. సమరాత్రి అనంతరం, 9వ తేదీ తర్వాత పౌర్ణమి అనంతరం వచ్చే తొలి ఆదివారం నాడు ఈ పండుగ జరుపు కోడానికి నిర్ణయిస్తారు. ఏసుప్రభు పరమ పదించిన అనంతరం, ఆయన అనుయాయులు, నిరాశ నిస్పృహల మధ్య కొట్టుమిట్టాడుతున్న పరిస్థితిని చూడలేక ఏసు ప్రభువు తిరిగి వారి కోసం పునర్జీవితుడయ్యాడని, తిరిగి వచ్చారని కథనం. క్రీస్తు విశ్వసనీయ అనుయాయులు అందరూ ఉదాసీనులై ఉన్న సమయంలో, ఓ స్త్రీ వారి వద్దకు వచ్చి ఆశ్చర్య చకితులను చేసిన, అనంతరం వారు ఏసు మృతదేహంపై నీళ్లు చల్లడానికి, సమాధి వద్దకు వెళ్లగా సమాధి పై భాగం తెరవబడి ఉండడాన్ని, అందులో ఇద్దరు ధవళ వస్త్ర దారులైన దేవదూతలు ఉండడాన్ని గమనించారు. ప్రస్ఫుట కాంతి ముఖా లతో ఉన్న ఆ దేవదూతలు... ఏసు ప్రాణాలతో బయట పడినారని వివరించారు. ఆ సమాధి వద్ద కూర్చుని ఏడుస్తున్న మగ్ధలేనా, ఈ విషయాన్ని విశ్వసించని స్థితిలో ఆమె ఏసు గొంతు వినడం జరిగింది. ప్రభువును తొలిసారి చూసింది. తాను పునరుజ్జీవం పొందిన ఈ విషయాన్ని తన అనుయాయులకు చెప్పమని క్రీస్తు కోరిన ఈ క్రమంలో మగ్ధలేనా ఆ సందేశాన్ని ప్రభువు నుండి తీసుకొని అనుచరులకు వినిపించింది. ఈ సందర్భాన్ని క్రైస్తవులు ఈస్టర్ పండుగలా జరుపుకుంటారు. క్రైస్తవులు ఈస్టర్‌ను వ్యక్తిగతంగా మరియు సార్వత్రికంగా పాటిస్తారు. పునరుత్థానం ద్వారా తననుసరించిన వారికి మరణం తర్వాత నిత్య జీవముందనే విషయాన్ని తెలియజెప్పాడు క్రీస్తు. జర్మనీ భాషలో ""ఈ ఓస్టర్"" అంటారు. అంటే దీని అర్థం ""దేవి" అని. ఈ దేవిని వసంత దేవిగా పిలుస్తారు.

ఈస్టర్ పండగను క్రిస్మస్ లాగా ఘనంగా జరుపుకోకున్నా, పవిత్రంగా, ఉత్తమంగా, సాంప్రదాయ రీతిలో జరుపుకుంటారు. క్రైస్తవ విశ్వాసం ఉన్నవారు మతపరమైన ఆచారాలు, జాగరణలు, చర్చికి వెళ్లడం ద్వారా ఈస్టర్‌ను పాటిస్తారు, సంప్రదాయాల ప్రకారం, ఆదివారం ఉదయం చర్చి వెలుపల కొత్త మంటను వెలిగించి, ఈస్టర్ జాగరణలో పాల్గొనడం ద్వారా ఈస్టర్ ఆదివారం జరుపుకుంటారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది క్రైస్తవులు ప్రత్యేక చర్చి సేవలు, సంగీతం, క్యాండిల్ లైట్, పువ్వులు, చర్చి గంటలు మోగించడంతో ఈస్టర్‌ను జరుపు కుంటారు. ఈస్టర్ ప్రకటనను పఠించడం, పాత నిబంధన చదవడం, కీర్తనలు పాడడం, ఈస్టర్ డే శుభాకాంక్షలు చెప్పడం వేడుకలలో భాగాలు. ఫిలిప్పీన్స్ మరియు స్పెయిన్ వంటి కొన్ని దేశాలలో ఈస్టర్ ఊరేగింపులు జరుగుతాయి. చాలా మంది క్రైస్తవులు ఈస్టర్‌ను గొప్ప పండుగగా భావిస్తారు. క్రైస్తవ విశ్వాసం ప్రకారం, యేసుక్రీస్తు పునరుత్థానమయ్యాడని గుర్తుచేసుకోవడానికి జరుపుకునే వేడుకల రోజు.



–ఆర్కె సంగనభట్ల

## బలం లేని బలగం

ఇది ఒక కుటుంబ చిత్రం మాత్రమే, ఫ్యామిలీ సెంటిమెంట్‌కు అనుగుణంగా మలిచారు.

తెలంగాణ జన జీవనాన్ని, భాష యాసలను, పాటలను బాగా వాడుకున్నారు.

కమర్షియల్ మసాలా జోడించకుండా తీశారు.

అయితే దీనికొక సామాజిక ప్రయోజనం లేదు, ఇందులో వర్గ సంఘర్షణ లేదు,

ఎలాంటి సందేశం లేదు, అభ్యుదయ దృక్పథం, భావ సంఘర్షణ అస్సలు లేదు.

ఎన్ని భిన్నాభిప్రాయాలున్నా, కలిసుండాలంటే ఆ బంధం,

బలగం అట్టే కాలం నిలబడదు.చనిపోయిన పెద్దాయన

ఆ కుటుంబం కోసం చేసిన గొప్ప త్యాగం ఏమిటో స్పష్టత లేదు.

ఆశాస్త్రీయ ఆలోచనలు, ఆచారాలకు బలం చేకూర్చారు.

పక్షులు ఆ పరిసరాల్లో ఉంటే,ఆహారం వాటి దృష్టిలో పడితే తప్పకుండా వస్తాయి, తింటాయి.

అంతేకాని వాటిలోకి లేనిపోనీ ఆత్మలను చొప్పించడం, సమాజానికి చేటు చేస్తున్న బ్రాహ్మణీయ భావజాలాన్ని పెంచి పోషించడం తప్ప వేరు కాదు.



రక్త సంబంధ వివాహాలను సమర్థించారు. ఎలాంటి ఆదర్శాలు లేని, వరకట్నం కోసం ప్లేట్ పిరా యించే అవకాశవాది ఇందులో హీరో వేరే అమ్మాయితో ప్రేమ వ్యవహారం తెలిసి కూడా వాడి వైపు మొగ్గుచూపే వ్యక్తిత్వం లేని అమ్మాయిని హీరోయిన్‌గా చూపారు.

ఈ సినిమాలో తెలంగాణ పోరాటపటిమ ఛాయలు కూడా లేకపోవడం విచారకరం.

మృతుడి గుణగనాలను జోడించి చివరలో జానపదులు పాడిన 'తోడుగా మా తోడుండి' పాట మాత్రం ఈ చిత్రానికే హైలైట్ అని చెప్పక తప్పదు.

– వేముల

## 'కుల నిర్మూలన', 'విప్లవం-ప్రతిఘాత విప్లవం' అనే

# తాత్విక సిద్ధాంతాలే అంబేద్కర్


(నిన్నటి సంచిక తరువాయి)

### 5. అంబేద్కర్ తాత్వికత

అంబేద్కర్ మొట్టమొదట ఆంత్రోపాలజీ అధ్యయనంతో తాత్విక అధ్యయనం మొదలైందని చెప్పవచ్చు. 1916 మే నెలలో ఆంత్రోపాలజీ సెమినార్‌లో "క్యాస్ట్స్ ఇన్ ఇండియా", "దేర్ మెకానిజం, జెనిసిస్ అండ్ డెవలప్‌మెంట్" అనే పరిశోధనా పత్రం సమర్పించారు. ఈ సిద్ధాంత వ్యాసమే ఆ తర్వాత అంబేద్కర్ మొత్తం రచనలన్నింటిలో విస్తరించింది. మార్క్స్, ఎంగెల్స్‌ల కమ్యూనిస్టు మ్యానిఫెస్టోయే ఆ తర్వాత అన్ని రచనలకి విస్తరింపజేసినట్టుగా 'భారతదేశంలో కులాలు', 'కుల నిర్మూలన', 'విప్లవం-ప్రతిఘాత విప్లవం' అనే తాత్విక సిద్ధాంతాలే అంబేద్కర్ రచనలన్నిటా విస్తరించాయి. భూ కమతాల గురించి అంబేద్కర్ భూమిని తిరిగి ప్రభుత్వ పరం చేయాలని, భూ యజమానులకు కొంతకాలం డివిడెండ్లు ఇవ్వాలని పేర్కొన్నారు. బ్రిటీషువాళ్లు పన్నులకోసం పెట్టిన వ్యవస్థలలో భూమి పై వ్యక్తిగత ఆస్థి భావన పెరుగుతూ వచ్చింది. అంతకుముందు భూమి సామిక ఆస్థి తప్ప, వ్యక్తిగత ఆస్థి ఉండేది కాదు. డా॥ బి.ఆర్. అంబేద్కర్ విద్యకు, విజ్ఞానానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. భారీపరిశ్రమలు, భూమి, ఇన్సూరెన్స్ కంపెనీలు, బ్యాంకులు మొదలైనవన్నీ ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కోరారు. స్టేట్ సోషలిజం, ప్రజాస్వామ్య సోషలిజంకు మార్గం వేశారు. ఆడవాళ్లకు ఇంటిపని, పిల్లల పెంపకం, వంట, ఇల్లు అలుకుడు మొదలైనవి మహిళలకే పరిమితం చేయడం, కొన్ని వృత్తులు ఫలానా కులాలవారే చేయడం అనేవి మహిళల పట్ల, నిమ్నకులాలపట్ల చిన్నచూపును, వారి శ్రమను చాకిరిగా, విలువలేనిదిగా చూడడాన్ని అంబేద్కర్ వ్యతిరేకించి ప్రత్యామ్నాయ మార్గాలను చూపారు. సమస్థ, వర్ణ, వర్గ, కుల, లింగ, భాష, దేశ, సంస్కృతి, మత, ప్రాంత వివక్షతలను, అసమానతలను రూపుమాపడం డా॥ బి.ఆర్. అంబేద్కర్ గారి లక్ష్యం. అదే వారి రచనల్లో, ఆచరణలో ఉన్న తాత్వికత.

6. ప్రపంచంలోని మహెూన్నత తాత్వికత "వన్ మ్యాన్ వన్ వాల్యూ, వన్ ఓట్".

"వన్ మ్యాన్ వన్ వాల్యూ, వన్ ఓట్" (ప్రతి మనిషికి ఒకే విలువ. ఒకే ఓటు) అనేది ఎంత గొప్ప తాత్వికతో నేను అనేక తాత్విక గ్రంథాల్లో, రచనల్లో, ప్రసంగాల్లో వివరించాను. దీన్ని బలంగా జీవితమంతా సమస్థరంగాల్లోకి విస్తరింపజేసిన దార్శనికుడు డా॥ బి.ఆర్. అంబేద్కర్. వేల యేళ్ళుగా ఎందరో తత్వవేత్తలు ఎన్నో సిద్ధాంతాలు చేశారు. వాటన్నిటి కన్నా అత్యంత వాస్తవికమైన అత్యున్నత తాత్వికత. అది రాజ్యాంగబద్ధమైంది. అన్నిటికి భూమికగా నిలిచింది. దీని ప్రాధాన్యతను బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మహిళలు గుర్తించాలి. ఇతర దేశాల్లో అనేక ఉద్యమాల తర్వాత సార్వత్రిక వయోజన ఓటు హక్కు కల్పించబడింది. మహిళలకు ఎంతో ఆలస్యంగా ఓటు హక్కు కల్పించారు.



7. 26 జనవరి 1950కి ముందు మనుషులందరూ సమానం కాదు భారత రాజ్యాంగం విశిష్ఠతను ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు సరిగ్గా గుర్తించడంలేదు. భారత రాజ్యాంగం మనుషులందరిని సమానం చేసింది. "వన్ మ్యాన్ వన్ వాల్యూ, వన్ ఓట్" (ప్రతి మనిషికి ఒకే విలువ. ఒకే ఓటు) అని స్థిరపర్చింది. 26 జనవరి 1950 నుంచి భారత రాజ్యాంగం ద్వారా ఇది తాత్విక భూమికగా నిలిచింది. దాంతో రాజ్యాంగబద్ధంగా మనుషులందరు సమానమయ్యారు. అంతకుముందు మనుషులందరు సమానులు కారు. విభిన్న కులాలుగా, వర్ణాలుగా, వర్గాలుగా, తెగలుగా, జాతులుగా అనేక అసమానతలకు, వివక్షతలకు, వెలివేతలకు, పీడనలకు, అణచివేతలకు గురయ్యే తత్వశాస్త్రాలు, పురాణ ఇతిహాసాలు, మనుస్మృతి, బ్రాహ్మణీయ శాస్త్రాలు, రామాయణం, మహాభారతాలు మొదలైనవి వర్ణ, కుల వ్యవస్థల అసమానతలకు పునాదిగా నిలిచాయి. వాటన్నిటిని పూర్వపక్షం చేస్తూ ఆధునిక సమాజ నిర్మాణం కోసం భారత రాజ్యాంగం ప్రపంచంలో ఒక గొప్ప రాజ్యాంగంగా ముందుకు వచ్చిన రోజు 26 జనవరి 1950.

8. భారత రాజ్యాంగానికి ముందు, భారత రాజ్యాంగానికి తర్వాత


అందువల్ల భారత రాజ్యాంగానికి ముందు, భారత రాజ్యాంగానికి తర్వాత అనే రెండు దశలుగా చరిత్రను, అంబేద్కర్‌ను, భారత జాతీయ ఉద్యమాలను స్వాతంత్ర్యానంతర పరిణామాలలో అంబేద్కర్ ప్రభావాన్ని లెక్కలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అధికారంలో ఉన్నంత కాలం నెహ్రూ, ఇందిరాగాంధీ తదితరుల కాంగ్రెస్ చరిత్ర వారికి పతనిర్దేశకుడైన గాంధీజీ ప్రాభవంలో కొనసాగారు. గాంధీయే దళితులకు ప్రతినిధి అన్నట్టుగా ఊరూరా గాంధీనగర్ పేరుతో హరిజనవాడలు వెలిశాయి. 1970 తర్వాత క్రమంగా ఈ పరిస్థితి మారుతూ వచ్చింది.

9. అంబేద్కరిజం సార్వజనీనత

వివక్ష, వెలివేత, అసమానతలు, పీడన ఎన్ని రూపాల్లో కొనసాగుతున్నదో అవన్నీ పరిష్కరించబడేదాక అంబేద్కర్ భావనలు, పరిష్కారాలు వెలుగు చూపుతూనే ఉంటాయి. అలా సమస్థ, వర్ణ, వర్గ, కుల, లింగ, జాతి, మత, భాష, సంస్కృతి, ప్రాంత, దేశ వివక్షతలకు, అసమానతలకు, అణచివేతలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక మద్దతునిస్తూ అంబేద్కర్ పీడితులందరికీ నేనున్నానని స్ఫూర్తినిస్తూ మార్గదర్శక స్ఫూర్తిధాతగా ముందుకు సాగుతూనే ఉంటారు. అలా ఓబీసీలకు కూడా అంబేద్కర్ మార్గదర్శిగా, స్ఫూర్తిదాతగా కొనసాగుతూనే ఉంటాడు. ఆఫ్రికా దేశాలతో పాటు ప్రపంచంలో అనేక దేశాలకు కుల, మత, జాతి, ప్రాంత వివక్షతలకు, అసమానతల సంస్కృతికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో, బహుళ పార్టీ వ్యవస్థలో 'ప్రజాస్వామ్యం, సోషలిజం' కోసం అంబేద్కరిజం స్ఫూర్తి ఇస్తూనే ఉంటుంది.

కుల వివక్ష, జెండర్ వివక్ష, కులవ్యవస్థ, బ్రాహ్మణిజం, క్యాపిటలిజం, భూస్వామ్య సంస్కృతి, పితృస్వామిక పురుషాధిక్య కుటుంబ వ్యవస్థ, వర్ణ వ్యవస్థ ఉన్నంత కాలం అంబేద్కర్ రచనలు మౌలిక భావాల ప్రాసంగికత కొనసాగుతుంటాయి. వాటి రిలవెన్స్ యాభయిఏళ్లకు ఇప్పటికి ఎన్నో రెట్లు పెరిగింది. ఇంకా పెరుగుతుంది. కుల మత జెండర్ వివక్ష, గృహహింస, పితృస్వామిక అసమానతలు లేని ప్రజాస్వామ్య సోషలిజం వ్యవస్థ, లింగ అసమానతలు లేని నూతన కుటుంబ సంస్కృతి ప్రపంచ వ్యాప్తంగా పరిణామం చెందే దాక కొనసాగుతూనే ఉంటాయి.

10. కులం, పుట్టుక అనే సిద్ధాంత వ్యాసంలో పితృస్వామిక వ్యవస్థ, వర్ణ కుల వ్యవస్థ ఎలా రూపొందాయో విశ్లేషించి దడి కట్టుకున్న వర్గమే కులంగా కరుడుకట్టుకుపోయిన తీరును స్పష్టం చేశారు. ఇలా పితృస్వామిక, వర్ణ కులాధిక్య వ్యవస్థల సిద్ధాంతాలకు, సంస్కృతికి, సామాజిక అసమానతలకు, సమస్థ రూపాలకు వ్యతిరేకంగా మనుషులందరూ సమానమే అని అంబేద్కర్ జీవితమంతా ఉద్యమించారు. రచనలు చేశారు. రాజ్యాంగంలో పొందుపరిచారు. 'ప్రతి మనిషికీ ఒకే విలువ ఒకే ఓటు' అని రాజ్యాంగంలో చేర్చడంలో క్రియాశీలక పాత్ర పోషించారు. అలా అంబేద్కర్ జీవితమంతా ఆధునిక భారతీయ సమాజ నిర్మాణం కోసం కృషి చేశారు. ఆధునిక భారతీయ, సామాజిక విప్లవ సిద్ధాంత కర్త డా॥ బి.ఆర్. అంబేద్కర్. (ఇంకా ఉంది)



- బి ఎస్ రాములు
బీసీ కమిషన్ మాజీ చైర్మన్
8331966987

## పేపర్ లీకేజీలో సంబంధం లేదని ఎలా అంటారు

### కెటిఆర్‌ను మరోమారు ప్రశ్నించిన రేవంత్

హైదరాబాద్,ఏప్రిల్8 (ప్రజా మంటలు) : టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారం మంత్రి కేటీఆర్ కు సంబంధం లేదని ఎలా చెప్తారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. నిందితుడి రాజశేఖర్ రెడ్డి నియామకం ఐటీ శాఖ ద్వారానే జరిగిందని చెప్పారు. టీఎస్పీఎస్సీకి సాంకేతిక పరిజ్ఞానం ఐటీ శాఖే అందిస్తోందన్నారు. తెలంగాణ ఉద్యమమే ఉద్యోగాల కేంద్రంగా జరిగిందన్నారు. అసలు తెలంగాణ ఉద్యమంతో కేటీఆర్?కు సంబంధం



లేదన్నారు. మంత్రి కేటీఆర్ తనకు పంపిన లీగల్ నోటీసులపై పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. లీగల్ నోటీసులతో పాటు పలు అంశాలపై స్పందిస్తూ కౌంటరిచ్చారు. లీగల్ నోటీసులను వెనక్కి తీసుకోకపోతే క్రిమినల్ చర్యలు ఉంటాయని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. తాను టీఎస్పీఎస్సీ విషయంలో నిరుద్యోగుల తరపున మాట్లాడని చెప్పారు.

## దోమలమందు తాగిన బాలుడు

### చికిత్స పొందుతూ మృత్యువాత

హైదరాబాద్,ఏప్రిల్8 (ప్రజా మంటలు) : హైదరాబాద్ చందానగర్‌లో విషాదం.. చోటు చేసుకుంది. ఏడాదిన్నర వయస్సు ఉన్న జాకీర్ అనే చిన్నారి.. ఆడుకుంటూ ఆడుకుంటూ దోమల మందు తాగేశాడు. ఇంట్లో దొమలను చంపటానికి పెట్టుకున్న లిక్విడ్ బాటిల్ తో ఆడుకుంటూ.. నోట్లో పెట్టుకుని తాగేశాడు. చిన్నారి ఏడుస్తుండటంతో.. ఎత్తుకున్న తల్లిదండ్రులకు మస్కిటో లిక్విడ్ వాసన వచ్చింది. అదే సమయంలో బాటిల్ లోని లిక్విడ్ కూడా తక్కువగా ఉంది. అసలు విషయం తెలిసి హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు తల్లిదండ్రులు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాలుడు చనిపోయాడు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తారానగర్ లో ఏప్రిల్ 8వ తేదీన ఈ ఘటన జరిగింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ప్రమాద వశాత్తు జరిగిందా లేక బాలుడి మరణంలో మరో కోణం ఏమైనా ఉందా అనే విషయంపై పేరంట్స్ ను విచారిస్తున్నారు. ప్రాథమిక విచారణలో అయితే.. చిన్నారి ఆడుకుంటూ మస్కిటో లిక్విడ్ తాగాడనేది స్పష్టం అయ్యిందన్నారు పోలీసులు. పూర్తి విచారణ జరుగుతుందని తెలిపారు.

## సహకార శక్తి అత్యంత బలమైనది

### వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి, ఏప్రిల్ 8 (ప్రజా మంటలు) : ప్రపంచలో అన్నింటికన్నా సహకార శక్తి అత్యంత బలమైనదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సహకార సంఘాల ద్వారా 208 మంది రైతులకు రూ.2.30 కోట్ల విలువైన వివిధరకాల రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల సమష్టి పెట్టుబడితో కష్టపెడితే ఏ




కార్యక్రమైనా విజయవంతం అవుతుందన్నారు. పాలమూరులో వేరుశెనగ, కంది, పప్పుశెనగ పరిశ్రమల ఏర్పాటుకు విస్తుత్ర అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.నష్టాల సాకుతో ప్రభుత్వరంగ సంస్థలను నరేంద్ర మోడీ విక్రయిస్తున్నారని ఆరోపించారు. నడిపే ప్రణాళిక, మనసు లేక కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుకు ధారాదత్తం చేస్తున్నదని మండిపడ్డారు.సహకార రంగాన్ని బలోపేతం చేయడం తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.పాలకవర్గాలు వినూత్న ఆలోచనలతో సహకార సంఘాల ఆదాయం పెంచాలని సూచించారు.విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వరి కొనుగోళ్లు, వ్యవసాయ యాంత్రీకరణ వ్యాపారంపై సహకార సంఘాలు దఅష్టిపెట్టాలన్నారు.తెలంగాణలో రైతుల భాగస్వామ్యంతో సహకార సంఘాల ద్వారా ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటు ఒక్క పరిశ్రమ మొదలైతే వందల పరిశ్రమల ఏర్పాటుకు అదే నాంది అవుతుందని అన్నారు.

## నిరు పేద కుటుంబానికి దాతల సాయం

### నూతన గృహ నిర్మాణ పనులు ప్రారంభం.

(రామ కిష్టయ్య సంగన భట్ల)

ధర్మపురి ఏప్రిల్ 08 (ప్రజా మంటలు) : ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఓ నిరుపేద మహిళల కుటుంబానికి ఓ ఎన్నారై దంపతులతో పాటు కొందరు స్థానికులు గృహ నిర్మాణం కోసం సాయం చేయడానికి ముందుకు వచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి . ధర్మపురికి చెందిన పోచంపల్లి జమున , లక్ష్మణ్ కు ఇద్దరు కూతుళ్లు. కొన్ని సంవత్సరాల నుండి భర్త లక్ష్మణ్ కుటుంబ బాధ్యతకు దూరంగా ఉండడంతో జమున తన ఉపాధి



కోసం కొందరి ఇండ్లలో బట్టలు పిండుతూ ఇద్దరు కూతుళ్లను పోషిస్తూ, బంధువుల ఇంట్లో తాత్కాలికంగా నివాసం ఉంటున్నది. అమెరికాలో ఉంటున్న ఆంధ్రప్రదేశ్ , పశ్చిమగోదావరి జిల్లా, జంగారెడ్డిగూడెం కు చెందిన సుంకర ప్రవీణ్, రమ్య దంపతులు తమ కుమారుడి జన్మదినం సందర్భంగా పేద వారికి సాయం చేస్తామని ధర్మపురికి చెందిన సమాజిక సేవకుడు రేణికుంట రమేష్ ను సంప్రదించారు. రమేష్ జమున కుటుంబ పరిస్థితిని వివరించి నూతన గృహ నిర్మాణం కోసం సాయం చేయాలని సూచించారు. దాంతో వారు స్పందించి రూ. 1.50 లక్షల వరకు సాయం చేస్తామని హామీ ఇచ్చి ముందుకు వచ్చారు. స్థానికులు కొందరు తమ వంతు కొంత సాయం చేస్తానని హామీ ఇవ్వడంతో సదరు మహిళ కుటుంబానికి నూతన గృహ నిర్మించేందుకు రమేష్ శనివారం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, వార్డ్ కౌన్సిలర్ అయ్యోరి వేణుగోపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొల్లం హరి ప్రసాద్ , జక్కు దేవేందర్, రేణికుంట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు మెడికాల్ కాలేజీలకు అనుమతులు

## కామారెడ్డి, ఆసిఫాబాద్ ఆస్పత్రులకు గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ,ఏప్రిల్8 (ప్రజా మంటలు) : జిల్లాకో మెడికల్ కాలేజీ అమలులో మరో ముందడుగు పడింది. రాష్ట్రంలోని కొత్తగా ఏర్పాటు చేసిన రెండు మెడికల్ కాలేజీలకు జాతీయ వైద్య కమిషన్ అనుమతులు జారీ చేసింది. కామారెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో వైద్య కళాశాలలకు అనుమతి ఇచ్చింది. ఆయా కళాశాలల్లో వంద సీట్ల చొప్పున ఎంబీబీఎస్ సీట్లతో అనుమతులు జారీ చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హర్షం వ్యక్తం చేశారు. గ్రామాల్లో వైద్యసేవల బలోపేతానికి మరింత ఆస్కారం ఉంటుందన్నారు. ప్రతి జిల్లాకో మెడికల్ కాలేజీ ఉండాలనే సీఎం కేసీఆర్ ఆశయ సాధనలో ఇది మరో ముందడుగు అన్నారు. మరో ఏడు వైద్య కళాశాలల అనుమతుల ప్రక్రియ వివిధ దశల్లో ఉందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపరచడమే కాకుండా ఔత్సాహిక వైద్య నిపుణులకు మరిన్ని అవకాశాలు వస్తాయన్నారు.

ఏదైనా పెద్ద వ్యాధి వస్తే.. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు పరుగెత్తాల్సిన పరిస్థితి. వందల కిలోమీటర్ల పాటు ప్రయాణించి హైదరాబాద్ రావాల్సిన పరిస్థితి. మరో వైపు వైపు నిరుపేదలు, మధ్య తరగతి విద్యార్థులకు అందని ద్రాక్షగా వైద్య విద్య ఉన్నది. లక్షలాది ఫీజులు పోసి చదువు'కొన' లేని దుస్థితి. తెలంగాణలో సూపర్ స్పెషాలిటీ సేవలను పేదలకు చేరువ చేయడంతో పాటు, వైద్య విద్యను విద్యార్థులకు అందించాలని సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా జిల్లాకో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యే సమయానికి ఐదు మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవి. గాంధీ (1954), ఉస్మానియా (1946) దవాఖానలు ఆంధ్రప్రదేశ్



ఆవిర్భవించే నాటికే ఉన్నాయి. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీని 1959లో ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఆదిలాబాద్‌లో రిమ్స్, నిజామాబాద్‌లో మెడికల్ కాలేజీలు ఏర్పాటయ్యాయి. 58 ఏండ్లలో తెలంగాణకు కేవలం మూడు మెడికల్ కాలేజీలు ఏర్పాటయ్యాయి. ఈ పరిస్థితుల్లో సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన అనంతరం 12 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారు. గతేడాది చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి ఎనిమిది మెడికల్ కాలేజీలకు ఒకేసారి ప్రారంభోత్సవం చేశారు. పలు జిల్లాల్లో ఇంకా మెడికల్ కాలేజీలు నిర్మాణ దశలో ఉన్నాయి. మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయడంతో పాటు సర్వాంగ సుందరంగా భవనాలను నిర్మిస్తున్నది. అదే సమయంలో ఆయా మెడికల్ కాలేజీలు, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఆసుపత్రుల్లో సిబ్బంది కొరతను తగ్గించేందుకు సైతం నర్సింగ్ కాలేజీలను సైతం ఏర్పాటు చేస్తున్న విషయం విదితమే.

# తిరుమలలో భక్తుల రద్దీ : శిలాతోరణం వరకు క్యూలైన్లు



తిరుమల,ఏప్రిల్8 (ప్రజా మంటలు) : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వరుస సెలవులతో రద్దీ పెరిగి..శనివారం ఔటర్ రింగ్ రోడ్డు, శిలా తోరణం వరకు క్యూ లైన్లు కొనసాగుతున్నాయి. వరుస సెలవులతో పాటు వారాంతపు రద్దీతో దేశం నలుమూలల నుండి తిరుమలకు వచ్చిన భక్తులతో పోటెత్తింది. శ్రీవారి దర్శనం కోసం టోకెన్ లేని భక్తులకు దాదాపు 30 గంటల సమయం పడుతున్నది. అన్నప్రసాద భవనం, తిరుమలలోని అన్న ప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాలలో పాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో ఆహారం, పాలు, త్రాగు నీరు అందించేందుకు టీటీడీ విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. మధ్యాహ్నానికి దాదాపు 79 వేల మందికి పైగా అన్న ప్రసాదం అందించగా, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ క్యూలైన్లలో 80 వేల మందికి అన్నప్రసాదాలు (ఇందులో ఉప్మా, పొంగల్ ఉన్నాయి) పంపిణీ చేశారు.

సాధారణం కంటే రెట్టింపుగా అన్న ప్రసాదాలు అందిం చారు. అంతే కాకుండా పిల్లలకు పాలు ఎప్పటి కప్పుడు అందిస్తు న్నారు. క్యూ లైన్లలో ఎలాంటి తొక్కిసలాట జరగకుండా టీటీడీ విజిలెన్స్, పోలీసు సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం 5 గంటల వరకు దాదాపు 50 వేల మంది యాత్రికులు శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం చేసుకున్నారు. భక్తుల అధిక రద్దీ కారణంగా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్లు, ఎస్ ఎస్ డి టోకెన్లు, దివ్య దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు మాత్రమే తిరుమలకు రావాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. టిటిడి ఈవో ఏవి ధర్మారెడ్డి ఆదేశాల మేరకు, జేఈవో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో ఇంజినీరింగ్, ఆరోగ్యం, అన్నప్రసాదం, విజిలెన్స్, వైద్య శాఖల ఉన్నతాధి కారులు భక్తుల సౌకర్యాలను, క్యూ లైన్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

# ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం : టిజెఎస్ ఆధ్వర్యంలో నేడు అఖిలపక్షం

గద్వాల,ఏప్రిల్8 (ప్రజామంటలు): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నపత్రాల లీకేజీ, తదనంతర పరిణామాలపై చర్చించేందుకు ఈ నెల తొమ్మిది ఆదివారం టీజేఎస్ ఆధ్వర్యంలో, పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించ నున్నట్లు పార్టీ జిల్లా కన్వీనర్ ఆలూరు ప్రకాష్ గౌడ్ తెలిపారు. సమావేశానికి టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య కోదండరాం హాజరవు తున్నట్లు తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్ర వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కోకన్వీనర్ భద్రప్ప, బీఎస్పీ గద్వాల ఇన్‌చార్జి ఎస్.వెంకట్ రెడ్డి, రవి, వెంకటస్వామి, వెంకట్రామి రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. సర్వీసు కమిషన్ నిర్వహించిన పరీక్ష ప్రశ్నపత్రాలు లీకేజీ కావడంతో లక్షలాది మంది నిరుద్యోగులు అభద్రతా భావానికి, ఆందోళనకు గురవుతున్నా ప్రభుత్వం నుంచి తగిన చర్యలు లేకపోవడం బాధ్యతా రాహిత్యమన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు తగిన కార్యాచరణను రూపొందించడమే లక్ష్యంగా తమ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గద్వాలలో జరిగే సమావేశానికి అన్ని పార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు. అదేరోజు సాయంత్రం పట్టణంలోని టీఎన్జీవో భవనంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం, 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభ ఉంటుందని తెలిపారు. దీంతో పాటు అప్పటి ఉమ్మడి హైదరాబాద్ రాష్ట్రంలో భాగంగా ఉన్న నడిగడ్డలో కర్ణాటక రాష్ట్రం మాదిరిగానే 371-జే ఆర్టికల్ ఆధారంగా జోగులాంబ స్పెషల్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు డిమాండ్‌పై చర్చించనున్నట్లు తెలిపారు.

## పాడిపరిశ్రమకు ప్రోత్సాహం

### అవసరాలకు తగ్గట్లుగా ఉత్పత్తి పెంపుదల: తలసాని

హైదరాబాద్,ఏప్రిల్8 (ప్రజా మంటలు) : పాడి పరిశ్రమ రంగ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పూర్తి స్థాయి సహకారం అందిస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాడి పరిశ్రమ రంగాన్ని ప్రోత్సహించేలా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అవసరాలకు సరిపడ పాల ఉత్పత్తిని పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధ్యయనానికి అధికారులతో కమిటీ నియమించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయం తర్వాత అత్యధిక కుటుంబాలకు జీవనాధారంగా పాడి పరిశ్రమ రంగం ఉందన్నారు. ఇలాంటి ఎగ్జిబిషన్లు పాడి పరిశ్రమ అభివృద్ధికి ఎంతో దోహదపడుతాయన్నారు. జీవాల ఆరోగ్య పరిరక్షణపై పశుసంవర్ధక శాఖ ప్రత్యేక కార్యాచరణతో పని చేస్తుందని స్పష్టం చేశారు. జీవాల వద్దకే వైద్య సేవలు తీసుకెళ్ళే విధంగా సంచార పశువైద్యశాలలు పని చేస్తున్నాయన్నారు. పాడి రైతులకు లీటర్



పాలకు రూ.4 నగదు ప్రోత్సాహకం అందిస్తున్నాం.. ఇలా ఇవ్వడం దేశంలో ఎక్కడా లేదన్నారు. మూసివేత దశకు చేరు కున్న విజయ డెయిరీ రూ. 650 కోట్ల టర్నోవర్ కు చేరుకుంది. రూ. 1,000 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా మరిన్ని కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు.

## ఆయిల్‌పామ్‌కు

### అనుకూలంగా మన నేలలు

వనపర్తి,ఏప్రిల్8 (ప్రజా మంటలు) : ఆయిల్ పామ్ సాగుకు మన నేలలు అనుకూలం. రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. దేశంలో వంట నూనెల డిమాండ్ కు తగినంతగా నూనెగింజల సాగు లేదు. ఏటా రూ.80 వేల కోట్ల విలువైన పామాయిల్ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని ఆయన తెలిపారు.

దేశంలో నూనె, పప్పుగింజలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. మార్కెట్లో వంట నూనెల డిమాండ్ నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సూచన మేరకు 20 లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వచ్చే జూన్ తర్వాత మూడు లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగుకు రైతులకు మొక్కలు సిద్ధమయ్యాయి. సంప్రదాయ పంటల సాగుతో నష్టపోతున్న రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు పండించాలని ఆయన సూచించారు.

# సింగరేణిని ప్రైవేటీకరిస్తే మరో ఉద్యమం

## సింగరేణి మహాధర్నాలో ప్రజలకు పిలుపునిచ్చిన మంత్రులు ఎర్రబెల్లి,సత్యవతి

భూపాలపల్లి,ఏప్రిల్8 (ప్రజా మంటలు) : తెలంగాణలోని సింగరేణి గనులను ప్రైవేట్‌పరం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు ప్రజలంతా మరో ఉద్యమానికి సిద్ధం కావాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. భూపాలపల్లిలో చేపట్టిన మహాధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించడం సిగ్గుచేటని అన్నారు. పార్లమెంట్‌లో అన్ని బిల్లులకు బీఆర్‌ఎస్ సహకరించలేదా? అని ప్రశ్నించారు. రైతులకు, తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని విధాన పరంగా కేంద్రాన్నివ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. రైతులను ముంచి ఆదానీ, అంబానీలకు దోచి పెడితే తామేందుకు సహకరించాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నందుకు సపోర్ట్ చేయాలా?అని మండిపడ్డారు. సీఎం కేసీఆర్, కేటీఆర్, కవిత ప్రజల కోసం, తెలంగాణ కోసం జైలుకు పోయారని పేర్కొన్నారు. మొన్న మత విద్వేషాలు,నిన్న పేపర్ లీకులు చేసి ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కుట్ర పన్నారని విమర్శించారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు యత్నించి ప్రభుత్వాన్ని కూల్చే



కుట్ర చేయడంతో సీఎం కేసీఆర్ వాటిని తెలివిగా తిప్పికొట్టారని తెలిపారు. నరేంద్ర మోదీ తెలంగాణకు ఏం చేశారని, విభజన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణ డబ్బులు తీసుకెళ్లి గుజరాత్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఖర్చు చేస్తుందని కేంద్రంపై విరుచుకుపడ్డారు. లాభాల బాటలో పయనిస్తున్నసింగరేణిలో నష్టాలు చూపి బొగ్గు గనులను ప్రైవేట్‌పరం చేసేందుకు యత్నిస్తుందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర సంపదను ప్రజల అభివృద్ధికి పంచుతుంటే నరేంద్ర మోదీ దేశ సంపదను దోస్తులకు దోచి పెడుతున్నాడని మంత్రి సత్యవతి రాథోడ్ ఆరోపించారు. కేంద్రానికి సహకరించడం లేదని చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. కేంద్రం తెలంగాణకు ఇచ్చిన ఒక్క హామీ అమలు చేయలేదని అన్నారు. తెలంగాణను విచ్ఛినం చేయడానికి చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.బండి సంజయ్ పేపర్ లీక్‌కు పాల్పడి జైలుకు వెళితే ఆయన్ను మందలించాల్సింది పోయి, అభినందిస్తున్నారని విరుచుకుపడ్డారు. బీజేపీ నాయకులను చూసి తెలంగాణ సమాజం అసహ్యించు కుంటుందని వెల్లడించారు.

## కొమిరెడ్డి రాములు కుటుంబాన్ని పరామర్శించిన పలువురు ప్రముఖులు

**మెటుపల్లి ఏప్రిల్ 08 (ప్రజామంటలు)** : నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో కన్ను మూసిన మాజీ ఎమ్మెల్యే సుప్రీంకోర్టు న్యాయవాది కొమిరెడ్డి రాములు కుటుంబాన్ని శనివారం నాడు పలువురు ప్రముఖులు పరామర్శించారు. తెలంగాణ



ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజీరెడ్డి గోవర్ధన్, రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, బుగ్గారాం మాజీ ఎమ్మెల్యే శిఖారి విశ్వనాథం మెట్పల్లిలోని కొమిరెడ్డి నివాసానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాములు సతీమణి, మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతి దేవి వారి కుమారులైన కొమిరెడ్డి కరంచంద్, కొమిరెడ్డి విజయ్ ఆజాద్, కొమిరెడ్డి కపిల్, రాములు సోదరుడు కొమిరెడ్డి రాంచందర్లతో మాట్లాడారు. అంతకు ముందు కొమిరెడ్డి రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తాను శాసన సభ స్పీకర్ ఉన్న సమయంలో శాసన సభలో జనతాపక్షనాయకుడిగా కొమిరెడ్డి రాములు పనిచేశారని ఆయనకు తనతో ఉన్న అనుబందాన్ని గుర్తు చేసుకున్నారు. అభివృద్ధితో పాటు ప్రజల సమస్యలపై స్పందించే నాయకుడైన కొమిరెడ్డి రాములు మృతి ఈ ప్రాంతానికి తీరని లోటని ఆయన పేర్కొన్నారు.

## గో బ్యాక్ నరేంద్ర మోడీ

### సిపిఐ ఆధ్వర్యంలో నిరసన

### ర్యాలీ, అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో

**హుస్నాబాద్ 08 ఏప్రిల్ (ప్రజామంటలు)** దేశ ప్రధాని నరేంద్ర మోడీ శనివారం హైదరాబాద్ పర్యటన సందర్భంగా మోడీ పర్యటనకు నిరసనగా హుస్నాబాద్ మండల కేంద్రంలో ఉన్న అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్ నుండి మల్లెచెట్టు చౌరస్తా మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహాల





వద్ద నల్ల బ్యాడ్జీలు,నల్ల జెండాలతో సిపిఐ హుస్నాబాద్ మండల సమితి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గడిపె మల్లేశ్ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర విభజనలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణలో పర్యటించడం దురదృష్టకరమని అన్నారు ఇప్పటికైనా విభజన హామీలు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ వెంటనే నెరవేర్చాలని గడిపె మల్లేశ్ డిమాండ్ చేశారు .కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అయిలేని సంజివరెడ్డి ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జనగాం రాజు కుమార్, మహిళలు, యువతీయువకులు, రైతులు, కూలీలు, కార్మికులు, కర్షకులు తదితరులు పాల్గొన్నారు.

## 59వ రోజుకు చేరిన మూడో విడత

### ఇందిరమ్మ ఇండ్ల రిలే నిరాహార దీక్షలు

**జనగామ ఏప్రిల్ 08 (ప్రజామంటలు)**:జనగామ పట్టణంలోని ఇందిరమ్మ 3డవ విడత లబ్ధిదారులు గత 57 వ రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేరుకున్నాయి. ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదు వెంటనే నిరుపేదల గురించి ఆలోచన చేసి వారిని పట్టించుకోవాలని, పట్టా కలిగిన ప్రతి ఒక్కరికి ఇల్లు ఇవ్వాలని లబ్ధిదారుల కమిటీ సభ్యులు తూర్పాటి సమ్మక్క డిమాండ్ చేశారు. శనివారం చిట్యాల ఐలమ్మ నగర్



డబల్ బెడ్రూమ్ ల వద్ద మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారుల రిలే నిరాహార దీక్షలు 59 వ రోజు దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తూర్పాటి సమ్మక్క మాట్లాడుతూ సర్వే పేరుతో కాలయాపన చేస్తూ గత కాంగ్రెస్ ప్రభుత్వం 2012 - 13 సంవత్సరంలో మూడో విడత ఇందిరమ్మ పథకం ద్వారా పట్టాలిచ్చి స్థలాలు చూపించడం మరిచారని, నేటి తెలంగాణ ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన వాళ్లకు 6 నెలల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని వాగ్దానం చేసి నేటికీ ఐదు సంవత్సరాలు కావస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తి కాకపోవడం పేదల పట్ల జనగాం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి కి చిత్తశుద్ధి లేదన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇండ్ల కోసం ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారిని ఇదే సందర్భంలో సర్వే చేయడం మోసం చేయడమే అన్నారు. ఇప్పటికైనా జిల్లా స్థానిక ఎమ్మెల్యే వెంటనే మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంజమ్మ, సర్వర్, యాదమ్మ, లక్ష్మిదేవి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్థితప్రజ్ఞుడు... డాక్టర్ హర్ష వర్ధన్

**బాడీ ఫిట్ నెస్ కొరకు ప్రతిరోజు జిమ్ చేసేవాడు**

**డాక్టర్ హర్ష అనాథలంటే ప్రేమ**

**లంగ్ క్యాన్సర్ సోకి మరణం**

**శవపేటికను తానే స్వయంగా ఆర్డర్ చేసుకున్న స్థితప్రజ్ఞుడు**

**ఖర్చుల కోసం స్నేహితులకు అవకాశం ఇవ్వకుండా ప్రతిదీ తనే ప్లాన్**

ఖమ్మం ఏప్రిల్ 08 (ప్రజామంటలు): డాక్టర్ ఏపూరి హర్ష వర్ధన్, ఖమ్మం, వృత్తి రీత్యా ఆస్ట్రేలియాలో బ్రిస్బేన్ లో జనరల్ మెడిసిన్ లో వైద్య సేవలు ఇస్తున్నాడు. పెళ్లి సమయం వచ్చింది. వైరా దగ్గరలోని మేనత్త ఊరిలో సింధు అనే అమ్మాయిని పరస్పరం వీడియోలో చూసుకున్నారు ఇష్టపడ్డారు. కరోనా కాలం మొదల వుతుంది ముందుగా నిర్ణయించిన సమయానికి అనగా ఫిబ్రవరి 12, 2020న హర్ష సింధుల వివాహం అత్యంత ఘనంగా ఖమ్మంలో జరిగింది. వారం రోజులపాటు తిరుపతిలోని గుళ్ళు, గోపురాలు అత్యంత ఆనందంగా కుటుంబ సభ్యులతో కలిసి తిరి గారు. డాక్టర్ హర్ష ఫిబ్రవరి 29 అనగా లీఫ్ సంవత్సరంన ఆస్ట్రేలియా వెళ్ళాడు. సింధు ఏప్రిల్ మొదటి వారంలో ఆస్ట్రేలియా వెళ్లడానికి ప్లాన్ చేసుకుంది. కానీ ఆ అమ్మాయి అదృష్టమో దురదృష్టమో కానీ 23 2020 నుండి కరోనా డేంజర్ బెల్స్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా లాక్ డౌన్ విధించబడింది. సింధు ఆస్ట్రేలియా వెళ్లలేకపోయింది.స్వతహాగా డాక్టర్ అయినా హర్ష కి పరిశుభ్రత అంటే ప్రాణం ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యత ఇచ్చేవాడు స్వయంగా వంట చేసుకునేవాడు జంక్ ఫుడ్ కూల్ డ్రింక్స్ పిజ్జా బర్గర్ వంటి వాటిని దగ్గరికి రానిచ్చేవాడు కాదు. డాక్టర్ హర్ష కి బాడీ ఫిట్ నెస్ అంటే ఇష్టం. దాని కొరకు ప్రతిరోజు జిమ్ చేసేవాడు. అక్టోబర్ 2020లో జిమ్ లో ఎక్సర్సైజ్ చేస్తుంటే ఆయాసం కొంచెం దగ్గు రావడం మొదలైంది. వెంటనే డాక్టర్ హర్ష పరీక్ష చేయించుకోగా ఉప్పెన లాంటి వార్త లంగ్ క్యాన్సర్ గా నిర్ధారణ జరిగింది. కుటుంబ సభ్యులందరూ కనీసం మూడు నెలల పాటు షాక్ లో ఉన్నారు. లాక్ డౌన్ కారణంగా తల్లిదండ్రులు ఆస్ట్రేలియా వెళ్లలేని పరిస్థితి హర్ష ఇండియా రాలేని పరిస్థితి విమానాలు నడవటం లేదు. క్యాన్సర్ సోకింది అన్న భయంకరమైన నిజాన్ని నేను భరించక తప్పదు అని భావించిన హర్ష తన తల్లిదండ్రుల్ని బంధువుల్ని తను ఇష్టపడే వాళ్ళందరినీ నాకు ఏమి కాదు తగ్గిపోతుందిలే అని మోటివేట్ చేశాడు. చికిత్స తీసుకుంటున్నాడు

**మరి అమాయకురాలైన సిందూ భవిష్యత్తు ?**

డాక్టర్ హర్ష ముందు తనకొచ్చిన క్యాన్సర్ వ్యాధి కంటే పెద్ద సమస్య సింధు భవిష్యత్తు సింధు మెరుగ్గా ఉండాలని ఆలోచించాడు. అసలే సింధు వాళ్ళ నాన్న ఆక్సిడెంట్ కు గురై ఎనిమిది సంవత్సరాల నుండి శరీరం చచ్చుబడి బెడ్ మీదనే ఉంటున్న అతనిని అత్యంత ఓపికస్తురాలైన సిందూ తల్లి అన్నీ తానై చూసుకుంటుంది సింధు గురించి మెరుగ్గా ఆలోచించాడు. విడాకులు కోరాడు కానీ సింధు ఒప్పుకోలేదు. లాక్ డౌన్ ఎత్తివేయగానే నేను ఆస్ట్రేలియా వచ్చి నీకు తోడు గా ఉంటాను అంది కానీ ఏ ముచ్చట తీరకుండానే విధవరాలు కావడం హర్ష కు ఇష్టం లేదు. ఇరు కుటుంబాల పెద్దలను ఒప్పించి విడాకులు తీసుకున్నాడు. విడాకుల సమయంలో ఆ అమ్మాయికి అన్నీ అదనంగానే ఇచ్చాడు. ఇప్పటికీ ఒక స్నేహితురాలిగా ఇస్తూనే ఉన్నాడు. సింధు ఎమ్మెస్ చదవడానికి అమెరికా వెళ్ళింది. సింధుకి పెళ్లి సంబంధాలు వచ్చినా నచ్చలేదు అంటుంది. డాక్టర్ తీసుకుంటున్న చికిత్స ఫలితంగా తగ్గిపోయింది అనుకున్న మహమ్మారి ఈసారి మరింత ఉధృతంగా దాడి చేసింది. డాక్టర్ హర్ష కి విషయం తెలిసింది తను ఈ భూమిపై ఉండేది కొన్ని రోజులేనని తల్లిదండ్రులు ఆస్ట్రేలియా వస్తా అన్నా కూడా వద్దు అన్నాడు. ఎందుకంటే ఆ వ్యాధి వల్ల తను పడే బాధలు వాళ్ళు చూడకూడదు అని బలంగా అనుకున్నాడు. వ్యాధి తీవ్రత తెలిసిన దగ్గర నుండి చికిత్స తీసుకుంటూనే ప్రతి క్షణం తన తల్లిదండ్రులను అత్యంత సున్నితంగా మానసికంగా తనకు ఏది జరిగినా భరించడానికి సిద్ధం చేస్తున్నాడు. 2020 ఫిబ్రవరిలో వెళ్లిన డాక్టర్ హర్ష రెండున్నర సంవత్సరాల తర్వాత 2022 అక్టోబర్లో చిట్ట చివరిసారిగా తన తల్లిదండ్రులను చూడడానికి ఇండియా ఖమ్మం వచ్చాడు. 15 రోజులు ఉండి ఒకేరోజు తన తల్లిదండ్రులను అమెరికాలోని తన తమ్ముడి దగ్గరకు పంపి తనకు ఆస్ట్రేలియాలోనే మెరుగైన వైద్యం లభిస్తుంది అని చెప్పి తను ఆస్ట్రేలియా వెళ్లిపోయాడు. డాక్టర్ హర్ష ఆస్ట్రేలియాలో 100 మందికి పైగా అనాథలు ఉన్న ఆశ్రమంలో వారికి అత్యంత ఓపికగా ప్రేమగా కావాల్సిన వైద్యం అందిస్తూ ఉంటాడు. డాక్టర్ హర్ష కు వాళ్లు అన్నా వారికి హర్ష అన్నా పిచ్చి ప్రేమ. కానీ డాక్టర్ హర్ష కి తెలుసు తన అనుకున్న వాళ్ళందరినీ ఈ భూమి మీద నుండి వెళ్లిపోవడానికి తనకి చికిత్స చేస్తున్న వైద్యులు మూడు ముందస్తు డెత్ తేదీలు ఇచ్చారని ఈ సమయంలోనే అత్యంత స్థితప్రజ్ఞత ప్రదర్శిస్తూ.... తన తల్లిదండ్రులను అందరూ ఆశ్చర్యపోయే విధంగా మానసికంగా సిద్ధం చేసిన విధానం వల్ల హర్ష అంటే అందరికీ మరింత గౌరవం ఏర్పడింది చక్కటి మనస్తత్వం కలిగి సహాయం చేసే సుగుణవంతుడైన డాక్టర్ హర్షకు స్నేహితులు ఇండియాలో ఆస్ట్రేలియాలో అనేకమంది ఉన్నారు. అవసరం ఉండి స్నేహితుల మెసేజ్ పెడితే ఎంత పనిలో ఉన్నా ఖచ్చితంగా సాధ్యమైనంత త్వరగా స్పందించేవాడు. ఫోన్ లో నేను ఒక గంట లేదా రెండు గంటల్లో స్పందించలేదు అంటే ఇక హర్ష లేడు అనుకోమని స్నేహితులతో ముందుగానే అన్నాడు. సమయం రానే వచ్చింది డాక్టర్లు ముందుగా ఇచ్చిన ఒక డెత్ డేట్ మార్చి 27 2023 దీనికి ముందుగానే తను చనిపోయినప్పుడు ఎవ్వరికీ బరువు భారం కాకుండా లాయర్ తో మాట్లాడి ఆథరైజేషన్ అక్కడి తన స్నేహితులకు ఇచ్చాడు. అలాగే శవపేటికను స్వయంగా ఆర్డర్ చేసుకున్నాడు. తన కారు అమ్మేశాడు. నిర్జీవమైన స్థితిలో తన తల్లిదండ్రుల వద్దకు రావడానికి కనీసం సింగిల్ డాలర్ కూడా ఖర్చు పెట్టుకోవడానికి తన స్నేహితులకు అవకాశం ఇవ్వకుండా ప్రతిదీ తనే ప్లాన్ చేసుకున్నాడు.



సిడ్నీలో ఉండే సైంటిస్ట్ అయినా తన బంధువుని మార్చ్ 24 వ తారీకు రమ్మన్నాడు మార్చి 23 తను రెగ్యులర్ గా వైద్య సేవలు అందించే ఆశ్రమానికి వెళ్ళాడు నేను ఇండియాకు వెళు తున్నాను అని బాయ్ బాయ్ చెప్పి వారి దగ్గర నుండి వీడ్కోలు తీసుకున్నాడు. 24 మార్చి ఉదయం బ్రౌన్ కలర్ జాకెట్ వేసుకొని తెల్లటి పాయింట్ తెల్లటి షూ ధరించి చక్కగా ఉన్నాడు తన స్నేహితులతో కలిసి చాలాసేపు తల్లిదండ్రులతో వీడియో కాల్ మాట్లాడాడు. అనంతరం అందరూ కలిసి టిఫిన్ చేసి వచ్చారు ఒక గంట తర్వాత మళ్లీ ఫోన్ చేస్తా అని తల్లికి చెప్పాడు. "నాకు మళ్ళీ కాఫీ తాగాలనిపిస్తుంది వెళ్దాం పద" అని స్నేహితులతో అంటే ఎందుకురా! ఇప్పుడే కదా తాగాము, అని స్నేహితులు అంటే తను ఒక్కడే స్వయంగా కారు నడుపుకుంటూ వెళ్లి కాఫీ తాగి వచ్చాడు. అనంతరం మూత్ర విసర్జనకు వాష్ రూమ్ కి వెళ్ళగా మూత్రం బదులు రక్తం రావడం గమనించాడు. స్నేహితులకు చెప్పాడు. నేను మరొక గంట కంటే ఎక్కువ సమయం మీ ముందు ఉండకపోవచ్చు అని నేను కొంచెం రెస్ట్ తీసుకుంటా అని పడుకున్నాడు.

**"అంతే రెండు నిమిషాల తర్వాత,**
**32 సంవత్సరాల హర్ష వర్ధన్ శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయాడు."**

ఇలాంటి పరిస్థితుల్లో కూడా అంతిమ దశలో తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లడానికి కావలసిన ఏర్పాట్లు తనే స్వయంగా చేసుకొని ఇలా కూడా చేయొచ్చా అని చూపి అందరికీ ఆదర్శవంతుడు అయ్యాడు స్థితప్రజ్ఞుడు డాక్టర్ హర్ష వర్ధన్...

**"ఇది కథ కాదు. జరిగిన యధార్థం"**

## సూరారంలో ఉచిత మెగా వైద్య, ఆరోగ్య శిభిరం

### 505 మందికి ఉచిత వైద్య పరీక్షలు, మందులు

**సికింద్రాబాద్ ఏప్రిల్ 08 (ప్రజామంటలు):** సూరారం కాలనీలోని సాయిబాబానగర్ లోని అంజిరెడ్డి బస్తీ సాయిబాబా టెంపుల్ ఆవరణలో శనివారం కోహెన్స్ లైఫ్ సైన్సెస్ సీ.ఎస్.ఆర్. స్కీం కింద మెగా ఉచిత వైద్య, ఆరోగ్య శిభిరాన్ని నిర్వహించినట్లు జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 10:00 నుంచి మద్యాహ్నం 3:00 వరకు కొనసాగిన ఈ క్యాంపుకు 505 మంది సందర్శించి వైద్య సేవలను పొందారు. నారాయణ మల్లారెడ్డి సూపర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి చెందిన జనరల్ మెడిసన్, గైనకాలజీ, పీడియాట్రిక్స్, డెర్మాటాలజీ, ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు ఆర్.బీ.ఎస్, హెచ్.జీ, ఫిజియోథెరపీ, బీపీ, ఈసీజీ పరీక్షలను చేసి, అవసరమైన మందులను ఉచితంగా అందచేశారు. తమకు ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు మందులను కూడ అందచేసిన కోహెన్స్, జనహిత సేవాట్రస్ట్ ప్రతినిధులకు స్థానిక కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోహెన్స్ లైఫ్ సైన్సెస్ కార్పొరేట్



ఎఫైర్స్ వైస్ ప్రెసిడెంట్ పీసపాటి రవికుమార్, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో గురుకుల (బాలికల) పాఠశాలకు అద్దె భవనములు కావలెను

**స్టేషన్ ఘనపూర్ ఏప్రిల్ 08 (ప్రజామంటలు):** జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, (బాలికలు) కళాశాల ధర్మసాగర్ నిర్వహించుటకు అద్దె భవనములు కావాలని సంబంధిత అధికారులు తెలియపరిచారు. ఈ భవనం వైశాల్యం 30వేల ఎస్ ఎఫ్ టి, వైశాల్యంలో ఉండి (640) మంది విద్యార్థులకు అన్ని వసతులు, తరగతి గదులు, హాస్టల్, భోజన శాల, క్రీడా ప్రాంగణం, తదితర సౌకర్యాలు ఉండాలని ఇట్టి సదుపాయాలు కలిగిన భవనముల యజమానులు కళాశాల ప్రిన్సిపల్ ఫోన్ నెంబర్ 79950 10601 లో సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

# తగ్గింపు స్వభావానికి సదృశ్యం యేసుక్రీస్తు

- రెవ.డాక్టర్ సంగాల పాల్సన్ రాజు
- క్రీస్తు మాదిరిగా 12 మంది శిష్యుల పాదాలు కడిగిన పాల్సన్ రాజు

**కరుణాపురం ఏప్రిల్ 8 (ప్రజామంటలు):** తగ్గింపు స్వభావం కలిగి లోక రక్షకుడు యేసుక్రీస్తు శిష్యుల పాదాలు కడిగి లోకానికి మాదిరిగా నిలిచారని క్రీస్తుజ్యోతి మినిస్ట్రీస్ ఫౌండర్ రెవ.డాక్టర్ సంగాల పాల్సన్ రాజు అన్నారు. శనివారం హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురంలో సొసైటీ ఆఫ్ క్రైస్ట్ ఆద్వర్యంలో 12 మంది శిష్యుల పాదాలు కడిగే కార్యక్రమం ఆయన మాట్లాడారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి రెవ.డాక్టర్ జయప్రకాశ్ గోపు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్సన్ రాజు మాట్లాడుతూ కరుణామయుడు యేసుక్రీస్తు తగ్గింపు కలిగి ఉండి పరలోక మర్మాలు శిష్యులకు వివరించారని అన్నారు. మానవుడు నిత్య జీవితంలో తగ్గింపు కలిగి ఉండాలని క్రీస్తు చక్కని ఉపమానం చెప్పారని, హెచ్చించుకునేవారు తగ్గించబడుతారని, తగ్గించుకునేవారు హెచ్చింపబడుతారని వివరించారన్నారు. ప్రస్తుతం మానవుడు హెచ్చించుకుంటూ అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. ఇలాంటి స్వభావాన్ని విడచి ఒపిక కలిగి తగ్గింపు మనసు కలిగి ఉండాలని అన్నారు. యేసు బోధలు నేటి సమాజంలో అనుసరణనీయమని, యేసు శిష్యుల పాదాలు కడిగిన సందర్భం మానవాళికి తగ్గింపు గుణం అలవర్చుకోవాలని మాదిరి చూపారని అన్నారు. రెవ.డాక్టర్ జయప్రకాశ్ గోపు మాట్లాడుతూ.... ప్రతియేటా పాల్సన్ రాజు క్రమం తప్పకుండా పాదాలు కడిగే కార్యక్రమం నిర్వహిస్తారని అన్నారు. క్రీస్తు బోధలు ఆచరణ ప్రతిరూపంగా పాల్సన్ రాజు సమాజంలో నిలిచిపోతారని అన్నారు. ఈ సందర్భంగా పాల్సన్ రాజు 12 మందివి వేదికపై ఆశేషమైన విశ్వాసుల సమక్షంలో పాదాలు కడిగి అందరి హృదయాలను కదిలించారు.ఈ దృశ్యం చూస్తున్న సమయంలో కొంత మంది విశ్వాసులు భోరున విలపించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి లక్షలాది మంది తరలివచ్చి వీక్షించారు. ఈ కార్యక్రమంలో సంగాల యిర్మియా, గోపు జయపాల్, రవిపాల్, జోసఫ్, ప్రభాకర్, పిలిప్పు, ఆరోగ్యరాజ్, ఎస్. డేవిడ్, డాక్టర్ ప్రదీప్, అంద్రెయ, హనోకు, సమూయేల్ పాల్గొన్నారు.









## మీసం ఉన్నవాళ్లు చేసే పనేనా

### స్టిక్కర్ల పథకంపై రఘురామ విమర్శలు

**న్యూఢిల్లీ,ఏప్రిల్8(ప్రజామంటలు):** ఇంటింటికీ స్టిక్కర్లు అతికించడంపై వైసీపీ ప్రభుత్వంపై ఎంపీ రఘురామ కృష్ణరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీసం ఉన్న రెడ్లు ఎవరు కూడా ఈ స్టికర్స్ పట్టుకొని తిరగరన్నారు. ఫోన్ పై స్టికర్స్ వేస్తున్నారు, కొందరు జగన్ మనసు దోచుకోడానికి పచ్చబొట్లు కూడా వేయించుకుంటారని విమర్శించారు. వాలంటిరీలు ప్రభుత్వ ఉద్యోగులు వాళ్ల పార్టీ కార్యక్రమాల్లో ఎలా పాల్గొంటారని ఆయన ప్రశ్నించారు. దీనిపై చీఫ్ సెక్రటరీకి లేఖ రాస్తానని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగులలో పార్టీ పనులు చేయించడం సరికాదన్నారు. ప్రభుత్వ జీతాలు ఇచ్చి పార్టీకి పని చేయించుకో వద్దని ఆయన సూచించారు. కొళాయి డబ్బులు కూడా తరలించారని ఆయన ఆరోపించారు. చిలకలురిపేట మీటింగ్‌లో కలెక్టర్లను పక్కన నిల్చోబెట్టారని మండిపడ్డారు. ఎంపీ లావు కృష్ణ దేవరాయలను సహితం మొదట స్టేజి మీదకు పిలవలేదన్నారు.



## నల్ల కండువాలు.. ప్లకార్డులతో ఉద్యోగుల ధర్నా

### లెనిన్ సెంటర్ వద్ద ఆందోళనలో ఎపి జెఎసి నేతలు

**విజయవాడ,ఏప్రిల్8(ప్రజామంటలు):** రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగ సంఘం నిరసన దీక్షలు చేపట్టింది. నల్ల కండువాలతో విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద ప్లకార్డులతో ఆందోళనకు దిగింది. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు, పెన్షన్లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. 11వ పీఆర్సీ ప్రతిపాదిత స్కేళ్లు అమలు చేయాలని, పీఆర్సీ అరియర్లు, పెండింగ్ డీఏలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఏపీలో ఉద్యోగులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, సమయానికి జీతాలు ఇవ్వలేని దుస్థితిలో సర్కార్ ఉందని బొప్పరాజు విమర్శించారు. ఉద్యోగులకే రూ. 70 వేల కోట్లు ఖర్చు చేస్తున్నారా? వాలంటీర్లు, సలహాదారులుగా ఉన్న వారికి రూ. 20 వేల కోట్లు ఇస్తున్న మాటను ఎందుకు చెప్పడం లేదని ఆయన ప్రశ్నించారు. సర్వీసు రూల్స్ కూడా సరిగ్గా అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. పొరుగు రాష్ట్రాలలో ఉద్యోగుల పరిస్థితి బాగుందని, మలిదశ పోస్టర్లు విడుదలతో ఉద్యమం మొదలై తీవ్రతరం అవుతుం దన్నారు. ప్రభుత్వ యాప్ వినియోగాన్ని నిలిపి వేస్తూ సెల్ ఫోన్ డౌన్ చేస్తామని బొప్పరాజు స్పష్టం చేశారు

## ఒంటిమిట్టలో వైభవంగా చక్రస్నానం

### ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

**తిరుపతి,ఏప్రిల్8(ప్రజామంటలు):** టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కడపలోని ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు శనివారం ఆలయ సమీపంలోని పుష్కరిణిలో చక్రస్నానం నేత్రపర్వంగా జరిగింది. యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గని పుణ్యస్నానాలు చేశారు.



ఆలయంలో ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవమూర్తులకు తిరుచ్చిలో, సుదర్శన చక్రత్తాళ్వార్ పల్లకిలో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో సీతారామ లక్ష్మణ సరసన చక్రత్తాళ్వార్లు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో అభిషేకాలు చేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయని డిప్యూటీ ఈవో నటేశ్‌బాబు తెలిపారు.

## శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

### శ్రీవారికి కానుకగా బస్సు సమర్పణ

**తిరుమల,ఏప్రిల్8(ప్రజామంటలు):** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని శనివారం ఇద్దరు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. జస్టిస్ నాగేశ్వరరావు, జస్టిస్ శ్రీదేవి శనివారం ఉదయం వేరువేరుగా కుటుంబ



సభ్యులతో ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయం లోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపంలో వారికి వేదపండితులు ఆశీర్వచనం చేశారు. అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ ముఖర్జీ, టీడీపీ ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్సీ శ్రీకాంత్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి శనివారం ఓ బస్సు కానుకగా అందింది. చెన్నైకు చెందిన అశోక్ లేలాండ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రెసిడెంట్ సంజీవ్‌కుమార్ దంపతులు రూ.31లక్షల విలువైన బస్సును అందజేశారు. శ్రీవారి ఆలయం ముందు ఈ బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తాళాలను టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డికి అందజేశారు. ఈకార్యక్రమంలో టీటీడీ ట్రాన్స్‌పోర్టు డీఐ జానకిరామిరెడ్డి, అశోక్ లేలాండ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతులను పట్టించుకోని జగన్

- వ్యవసాయ రంగం పూర్తిగా నిర్లక్ష్యం
- రైతులతో ముఖాముఖిలో నారా లోకేశ్

**అనంతపురం, ఏప్రిల్ 8 (ప్రజామంటలు):** వ్యవసాయరంగాన్ని జగన్ సర్కార్ పట్టించుకోవట్లేదని, పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేశ్ దుయ్యబట్టారు. జగన్ పాలనలో రైతుల ఆత్మహత్యల్లో ఏపీ మూడో స్థానం ఉందని తెలిపారు. ఒక్కో రైతుపై రూ.2 లక్షల అప్పుల భారం మోపారని గుర్తుచేశారు. టీడీపీ నేత నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రకు విశేష స్పందన వస్తోంది. పాదయాత్రంలో భాగంగా రైతులతో నారా లోకేశ్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ సీఎం జగన్ ఏపీని రైతులు లేని రాజ్యంగా మార్చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికీ 60శాతం మంది రైతులు సాగుపైనే ఆధారపడ్డారని, రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ఆయన తెలిపారు. తాము అధికారంలోకి రాగానే రైతుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతుల మనసు గెలిచాకే తలపాగా కడతామని నారా లోకేశ్ ప్రకటించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నారా లోకేష్ అన్నారు. మేం అధికారంలోకి రాగానే రైతుల సమస్యలు పరిష్కరిస్తామని, రైతుల మనసు గెలిచాకే తలపాగా కడతానని నారా లోకేష్ స్పష్టం చేశారు. రైతులతో నారా లోకేశ్ ముఖాముఖిగా మాట్లాడారు. మరోవైపు.. జగన్ పేరు ఇప్పుడు చోర్ మోహన్ అని, సంక్షేమ కార్యక్రమాలు కట్ చేసిన వ్యక్తి చోర్ మోహన్ అని, జగన్ సర్కార్ రూ.10 ఇస్తూ.. రూ.100 దోచుకుంటోందని లోకేష్ ఆరోపించారు. రాష్ట్రానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది టీడీపీనే అని లోకేష్ అన్నారు. రాష్ట్రానికి, ప్రజలకు చోర్ మోహన్ చేసిందేమీ లేదని మండిపడ్డారు. బీసీలకు జగన్‌రెడ్డి వెన్నుపోటు పొడిచారని, బీసీలపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధిస్తున్నారని లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు భద్రత కల్పించేందుకు ప్రత్యేక చట్టం తెస్తామని, మోటార్లకు మీటర్లు పెట్టి రైతుల మెడకు ఉరితాళ్లు బిగిస్తున్నారని, రాయలసీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ జగన్ అని లోకేష్ వ్యాఖ్యానించారు. మరోవైపు దేశంలో రైతులపై అత్యధిక రుణభారం ఉన్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. ప్రతి రైతుపై సగటున రూ.2,45,554.00 అప్పు ఉన్నట్లు కేంద్రమంత్రి భగవత్ రాజ్యసభలో వెల్లడించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో అత్యధిక మంది ఆధారపడేది వ్యవసాయంపైనే. సాగు చేయాలంటే పెట్టుబడి కావాలి. గతంలో సున్నా వడ్డీ, పావలా వడ్డీ పంట రుణాలు అందించేవారు. దీనివల్ల రైతన్నలకు వడ్డీల భారం తగ్గేది. జగన్ సర్కారు పావలా వడ్డీ రుణాలకు మంగళం పాడేసింది. వడ్డీతో సహా రుణం చెల్లిస్తేనే సున్నా వడ్డీ రాయితీ అని మెలిక పెట్టింది. దీంతో రైతుల పై వడ్డీల భారం పడుతోంది. ఇక 90 శాతం మంది కౌలురైతులకు రుణాలు అందించడం లేదు. ఈ లెక్కన వైసీపీ ప్రభుత్వం వల్ల అన్నదాతలకు కొత్తగా ఒనగూరుతున్నదేమిటి అనే



ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అలాగే ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా కూడా చాలా తక్కువ మందికి అందుతోంది. గత ప్రభుత్వంలో రాయితీపై సూక్ష్మపోషకాలు, విత్తనాలు, ఎరువులు, యంత్రాలు, ఇలా అనేక రకాలుగా రైతాంగానికి లబ్ది ఉండేది. ఇప్పుడు రాయితీ పథకాలను అరకొరగా అమలు చేస్తున్నారు. కొన్ని పథకాలు ఉన్నాయో లేవో రైతులకే తెలియని పరిస్థితి. ప్రభుత్వం నిర్లక్ష్యం, వైఫల్యం వల్ల రైతులకు మేలు జరగడం లేదు. వ్యవసాయానికి తగినంత ఊతం అందడం లేదు. ప్రభుత్వం పెట్టుబడి సాయం, పరిహారం అరకొరగా ఇస్తూ చేతులు దులుపుకొంటోంది.

## వ్యవసాయరంగంపై బాబు అనుకూల మీడియా విషం

- విషయ పరిజ్ఞానం లేకుండా కథనాలు
- వ్యవసాయ రంగంలో 13.18 శాతం వృద్ధి రేటు
- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

**అమరావతి,ఏప్రిల్8(ప్రజా మంటలు ):** ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగంపై తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అనుకూల మీడియా మరోసారి విషం చిమ్మిందని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విరుచుకుపడ్డారు. ఏ మాత్రం విలువలు, విషయ పరిజ్ఞానం లేకుండా కథనాలు రాస్తున్నారని దుయ్యబట్టారు. శనివారం మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. మన రాష్ట్రం వ్యవసాయ రంగంలో 13.18 శాతం వృద్ధి రేటు సాధించిందని తెలిపారు. వ్యవసాయాభివృద్ధిలో జాతీయ స్థాయి కంటే ఏపీ ముందు ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వృద్ధి రేటు పెరగలేదని.. ఉత్పత్తి తగ్గిందని మంత్రి కాకాణి పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) ద్వారా నాణ్యమైన విత్తనాలు అందించామని.. పొలం బడి ద్వారా రైతులకు అవగాహన కల్పించామని వివరించారు. చంద్రబాబు హయాంలో భూగర్భ జలాలు అడుగంటిపోయి.. రాష్ట్రవ్యాప్తంగా 1,623 కరువు మండలాలను ప్రకటించారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం మాత్రం ఒక్క కరువు మండలాన్ని కూడా ప్రకటించలేదని వివరించారు. రాష్ట్రానికి కరువు రావాలని, రైతులు విలవిలలాడాలని చంద్రబాబు, ఆయన అనుకూల మీడియా కోరుకుంటున్నారని నిప్పులు చెరిగారు. మహిళలను మోసం చేసిన ఘనత చంద్రబాబుదని మంత్రి కాకాణి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో మహిళలను అన్ని విధాలుగా ఆదుకున్న ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిదని స్పష్టం చేశారు. చంద్రబాబులాంటి పనికి మాలిన వ్యక్తులు తిడితే పట్టించుకోమన్నారు. రాష్ట్రంలో ఏ ఇంటికి వెళ్లినా గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలు చెబుతారన్నారు. చంద్రబాబు అక్కడికి వెళ్లి సెల్ఫీలు తీసుకోవాలని సెటైర్లు వేశారు. తమ ప్రభుత్వంలో వ్యవసాయం లాభసాటిగా మారిందని.. తాము తీసుకున్న విధానాలు వల్ల ఉత్పత్తి పెరిగిందని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి చెప్పారు. రైతులకు గిట్టుబాటు వస్తుంటే చంద్రబాబు, మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి కడుపు మండుతుందని ÷రైయ్యారు. గత ప్రభుత్వంలో సోమిరెడ్డి మిల్లర్ల వద్ద ముడుపులు తీసుకుని వారిని నిలువునా మోసం చేశారని దుయ్యబట్టారు. గత టీడీపీ ప్రభుత్వంలో పారదర్శకంగా



పరిపాలన చేశానని చంద్రబాబు చెప్పలగలరా అని మంత్రి కాకాణి సూటిగా ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాలో తెలుగు దేశం పార్టీ భూస్థాపితమైనదని.. ఈ విషయాన్ని శుక్రవారం జరిగిన సమీక్షలో చంద్రబాబు కూడా ఒప్పుకున్నారని చెప్పారు. చంద్రబాబుకు పాజిటివ్ ఓటు బ్యాంక్ లేదని.. ఆయన అంతంటి మోసగాడు లేదని టీడీపీ నేతలే చెబుతున్నారని వ్యాఖ్యానించారు. చంద్రబాబు పర్యటనల వల్ల తమ పార్టీకి ఎలాంటి నష్టం ఉండదని మంత్రి కాకాణి అన్నారు. ఇక, తాము చేసిన అభివృద్ధిని చూపిస్తూ చంద్రబాబు సెల్ఫీలు తీసుకోవడం సిగ్గు చేటని దుయ్యబట్టారు. కాగా, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సెల్ఫీ సవాల్ విసిరిన విషయం తెలిసిందే. నెల్లూరులో టిడ్కో కాలనీ ఇళ్ల ముందు సెల్ఫీ తీసుకున్న చంద్రబాబు.. ఆ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. గత ప్రభుత్వంలో పేదల కోసం కట్టిన వేలాది ఇళ్లు ఇవి అని.. రాష్ట్రంలో నాడు నిర్మించిన లక్షల టిడ్కో ఇళ్లకు సజీవ సాక్ష్యాలని చెప్పారు. మరి నాలుగేళ్లలో మీరు నిర్మించిన పేదల ఇళ్లు ఎన్నో లెక్క చెప్పగలరా? అసలు మీరు కట్టిన ఇళ్లు ఎన్నో చూపించగలరా అని సీఎం జగన్‌కు చంద్రబాబు చంద్రబాబు సవాల్ విసిరారు. ఈ క్రమంలో మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఫైయ్యారు.

## ఏప్రిల్ 11 నుంచి డ్యూటీలను బహిష్కరిస్తాం

### సర్కార్ కు జూడాల అల్టిమేటం

### గాంధీ మెడికల్ కాలేజీలో జూడాల ఆందోళన

### తమ డిమాండ్లను పరిష్కారించాలని డిమాండ్

**సికింద్రాబాద్ ఏప్రిల్ 08 (ప్రజామంటలు):** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఈనెల 11 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆసుపత్రుల్లో ఎమర్జెన్సీ సర్వీసులు తప్ప మిగితా అన్ని రకాల వైద్య సేవలను బాయ్కాట్ చేస్తామని గాంధీ మెడికల్ కాలేజీ జూడాలు ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. శనివారం గాంధీ మెడికల్ కాలేజీ ఎదుట జూడాలు నల్ల బ్యాడ్జీలు



ధరించి ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... తమకు, ముఖ్యంగా మహిళా పీజీ లకు హైజనిక్, సెక్యూరిటీతో కూడిన వసతిగృహాలను కేటాయించాలని, ఎన్.ఎమ్.సీ నోటిఫికెషన్, స్టేట్ గవర్నమెట్ గైడ్ లైన్స్ ప్రకారం జిల్లాల్లో పనిచేసే పీజీ వైద్యులకు ఫుడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. స్టయిఫండ్ ను పెంచాలని, ప్రతినెలా 10 వ తేదీలోగా ఇస్తామని లిఖిత పూర్వకంగా తమకు అశ్యూరెన్స్ ఇవ్వాలన్నారు. పెండింగ్ స్టయిఫండ్ క్లియరెన్స్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళన కార్యక్రమంలో గాంధీ జూడా ప్రెసిడెంట్ డాక్టర్ కరిష్మి, టీ. జూడా జనరల్ సెక్రటరీ డా. అఖిల్, వైస్ ప్రెసిడెంట్ డా. కౌశిక్ జోషి, జూడా ప్రతినిధులు డా.భానుప్రసన్న, డా. మహిమ, డా. నవీన్, డా. వినయ్, డా. యోగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ప్రైవేట్ పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు

### సింగరేణి ఆఫీస్ వద్ద ఉద్యోగుల ఆందోళన

**సికింద్రాబాద్ ఏప్రిల్ 08 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు సింగరేణి ప్రైవేట్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం



చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రతి జిల్లాలో చేస్తున్న నిరసనల్లో భాగంగా శనివారం సిటీలోని లక్టీకాపూల్ లోని సింగరేణి కార్యాలయం వద్ద ఓబీసీ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో డి ఆర్ డి ఎల్ దానకర్ణ చారి, బిఎస్ఎన్ఎల్ పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్, హెచ్ సి ఎల్ రవి కుమార్ ముదిరాజ్, హెచ్ఎంటి సురేందర్ ముదిరాజ్,పోస్టల్ బాలయ్య రామ్మూర్తి, రైల్వే నర్సింగ్ ముదిరాజ్ లతో పాటు అనేక కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎల్.ఐ.సీ, పోస్టల్, సింగరేణి లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం కోసం భవిష్యత్ లో మరిన్ని ఆందోళన కార్యక్రమాలను చేపడతామని వారు పేర్కొన్నారు.

## కోరట్ల పట్టణ ట్రస్మా ఎన్నికలు

### అధ్యక్షునిగా రమేష్, కార్యదర్శిగా రాజేంద్ర ప్రసాద్, కోశాధికారిగా దీపక్

**కోరట్ల ఏప్రిల్ 08 (ప్రజామంటలు):** పట్టణ ట్రస్మా ఎన్నికలు స్థానిక గౌతమ్ హైస్కూల్ లో గౌరవ అధ్యక్షులు ఎంఏ గఫార్ ఆధ్వర్యంలో జరిగాయి. సభ్యులందరు ఏకగ్రీవంగా



అధ్యక్షునిగా సాయి జీనియస్ హై స్కూల్ కరస్పాండెంట్ చౌకి రమేష్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సంఘ అభివృద్ధికి పాటుపడుతానని, ఎల్ల వేళల సభ్యులకు అందుబాటులో ఉంటూ







సమస్యల పరిష్కారానికి సభ్యుల సహకారంతో కృషి చేస్తానని కోరుట్ల ట్రస్మా ను ఉన్నత స్థానంలో నిలబెడతానని పేర్కొన్నారు సంఘ ప్రధాన కార్యదర్శిగా కుడేలు రాజేంద్ర ప్రసాద్, కోశాధికారిగా తంగళ్లపల్లి దీపక్, ఉపాధ్యక్షులుగా పిన్నం శెట్టి శ్రీధర్, గుజ్జేటి వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జాప నరేష్, స్పోర్ట్స్ కార్యదర్శిగా ఎంఏ. భారీ, కోర్ కమీటి సభ్యులుగా తుమ్మనపెల్లి సత్యనారాయణ, బ్రహ్మన్నగారి శంకర్ శర్మ, బండి మహాదేవ్, బాలాజీ దామోదర్ లను ఎన్ను కున్నట్లు ఎన్నికల పరిశీలకులు తెలిపారు. ఈ సమావేశంలో సిద్దార్థ, రహీం, మొయిజ్, తదితరులు పాల్గొన్నారు.






# సీనియర్ భామలు మెలితిప్పేస్తున్నారే!

రంగుల ప్రపంచంలో హీరోయిన్ల మధ్య పోటీ ఎలా? ఉంటుందన్నది చెప్పాల్సిన పనిలేదు. వెండి తెర పై ఒకరికొకరు పోటీ పడి నటించడానికి ఏమాత్రం వెనకడుగు వేయరు. అద్భుతమైన నటనే కాదు. అవసరమైతే అదే రేంజ్ లో అందాలు ఆరబోస్తున్నారు. స్కిన్ షో..గ్లామర్ షో..క్లీవేజ్ షో అంటూ రచ్చ మామూలుగా ఉండదు. అవసరం మేర ఇంటిమేట్ సన్నివేశాల్లో నటించడానికి ఏమాత్రం వెనుకడుగు వేయరు. సహజంగా ఈ పోటీ వాతావరణం ఎక్కువగా నవతరం నాయికల్లో కనిపిస్తుంది. కానీ ఈ విషయంలో సీనియర్ భామలు కూడా తక్కువేం కాదని నిరూపిస్తున్నారు. తమన్నా..కాజల్ అగర్వాల్..సమంత..శ్రుతి హాసన్ లు సైతం ఒకరికొకరు స్కిన్ షో విషయంలో పోటీ పడుతున్నారు. ఈ మధ్యనే రిలీజ్ అయిన 'వీరసింహారెడ్డి'లో శ్రుతిహాసన్ ఎలా చెలరేగిందో? తెలిసిందే. సీనియర్ స్టార్ బాలయ్య సరసన గ్లామర్ డాల్ గా ఆకర్షించింది. ఇన్ స్టా గ్లామర్ క్వీన్ లా వెండి తెర పై చెలరేగింది. స్కిన్ షో ఎలివేషన్ లో తనదైన మార్క్ వేసింది. బాలయ్యకి? కుమార్తె వయసున్న శ్రుతిహాసన్ ఏంటి? అని విమర్శించిన వారికి నోటి మీద వేలేసుకునేలా సమాధానం ఇచ్చింది. అలాగే 'వాల్తేరు వీరయ్య'లోనూ తనదైన మార్క్ అప్పీరియన్స్ తో ఆకట్టుకుంది. అలాగే చందమామ కాజల్ అగర్వాల్ మమ్మీ అయినా అందం ఏమాత్రం తరిగిపోలేదు. కాస్త బొద్దు గా తయరైనా బ్యూటీ విషయంలో ఎక్కడా చెక్కు చెదరలేదు. 'ఇండియన్ -2'లో అందాల విందు చేయనుందని అభిమానులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. శంకర్ సినిమా అంటే? పాత్రకి అనుగుణంగా ఎవరైనా సిద్దం కావాల్సిందే కాబట్టి చందమామ అందాలపై ఆశలు భారీగానే ఉన్నాయి. ఇక మిల్కీబ్యూటీ తమన్నా ఇంకా కుర్ర భామలాగే చెలరేగుతుంది. పాల అందాలతో అదే ఛరిష్మాతో కొనసాగుతుంది. చిన్న సినిమాల్లో సైతం తనదైన శైలి అందాల ఆరబోత తప్పనిసరి అంటోంది. మెగాస్టార్ చిరంజీవి సరసన నటిస్తోన్న 'భోళాశంకర్' లో తమన్నా అందాలు విచ్చలవిడిగానే ఉంటాయని అంచనాలున్నాయి. మెహర్ రమేష్ సినిమాల్లో హీరోయిన్లను గ్లామరస్ బ్యూటీలుగా ఆవిష్కరించడం ఆయన స్టైల్. అయితే అన్నయ్యతో సినిమా కాబట్టి ఆ విషయంలో కాస్త బ్యాలెన్స్ గా ఉండే ఛాన్స్ ఉంది. ఇక వీళ్లందరికంటే సమంత గ్లామర్ ఎలివేషన్ లో చాలా అడ్వాన్స్ గా ఉంది. 'ఊ అంటావా' పాటతో దేశాన్ని తన అందాలతో కట్టిపడేసింది. ఇండియన్ వెర్షన్ 'సీటాడెల్' సిరీస్ లోనూ సమంత కొన్ని ఇంటిమేట్ సన్నివేశాల్లోనూ నటిస్తుందని ప్రచారం సాగుతోంది. ఆ రకంగా ఈ నలుగురు భామలు నవ నాయికల్లే మించిపోతున్నారు.

# భారీ అంచనలాలతో విజయ్ లియో

'ఖైదీ', 'విక్రమ్' వంటి సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న దర్శకుడు లోకేశ్ కనకరాజ్ దేశమంతటా ఫ్యాన్ ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నారు. ఆయన తాజాగా తెరకెక్కిస్తున్న మూవీ లియో . కోలీవుడ్ స్టార్ విజయ్ హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ 50శాతానికి పైగా పూర్తయింది. కశ్మీర్, కొడైకెనాల్ వంటి ప్రాంతాల్లో 'లియో' ను చిత్రీకరించారు. ఈ మూవీలో ఓ స్టార్ హీరో నటించనున్నారని తెలుస్తోంది. విజయ్‌కు విలన్‌గా కనిపించనున్నారని సమాచారం అందుతుంది. 'లియో' లో కోలీవుడ్ సూపర్ స్టార్ ధనుష్ నటించనున్నారని వదంతులు షికార్లు కొడుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్‌లో ఆయనకు సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించనున్నారట. చెన్నైలోని శాలిగ్రామంలో ఉన్న ప్రసాద్ ల్యాబ్స్‌లో ఈ సీన్స్‌ను షూట్ చేయనున్నారని రూమర్స్ హల్‌చల్ చేస్తున్నాయి. విక్రమ్ సినిమాలోని రోలెక్స్ పాత్ర మాదిరిగానే ధనుష్ రోల్ 'లియో' లో ఉండనుందట. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన మేకర్స్ నుంచి త్వరలోనే రానుందట. ధనుష్ ఈ మధ్య కొన్ని సినిమాల్లో నెగెటివ్ రోల్స్ చేశారు. 'ది గ్రే మ్యాన్', 'నానే వరువెన్' వంటి చిత్రాల్లో గ్రే షేడ్స్ ఉన్న పాత్రలు పోషించారు. 'లియో' ను సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ భారీ బ్జడెట్‌తో రూపొందిస్తుంది. ఈ సినిమాలో త్రిష హీరోయిన్ పాత్రను పోషిస్తున్నారు. అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. అర్జున్, సంజయ్ దత్, మన్సూర్ అలీ ఖాన్, మిస్కిన్, గౌతమ్ మీనన్, మాథ్యూ థామస్, కతిర్, ప్రియా ఆనంద్, బాబు ఆంథొనీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'లియో' పై భారీ బజ్ ఉంది. అందుకు తగ్గట్టుగానే సినిమా కోలీవుడ్ హిస్టరీలోనే అత్యధికంగా రూ.400కోట్లకు పైగా ప్రీ రిలీజ్ బిజినెస్ చేసింది.





# తెలుగులోకి విజయ్ సేతుపతి విడుదలై

## విడుదల పార్ట్-1 గా ట్రైలర్ విడుదల

వెట్రిమారన్ సినిమాలకు తమిళంలోనే కాకుండా తెలుగులోనూ మంచి క్రేజ్ ఉంది. తెలుగులో డబ్ చేసిన పందెం కోడి, నారప్ప వంటి సినిమాలకు ఇతనే ఒరిజినల్ దర్శకుడు. తమిళంలో విజయ్ సేతుపతి 'విడుదలై' అనే సినిమా విమర్శల ప్రశంసలందుకుంది. ఈ సినిమాతో వెట్రిమారన్ మరో హిట్టందుకున్నాడు. ఈ సినిమాను 'విడుదల పార్ట్ 1'గా తెలుగులోకి డబ్ చేయనున్నారు. తమిళంలో స్టార్ కమెడియన్ గా పేరున్న సూరి ఈ సినిమాలో సీరియస్ పాత్రలో నటించాడు. ఇందుకు సంబంధించిన ట్రైలర్ ను తాజాగా విడుదల చేశారు. గీతా ఆర్ట్స్ బ్యానర్ సమర్పిస్తుండటంతో దీనిపై మరింత ఆసక్తి నెలకొంది. తలైవా రజనీకాంత్ ను సైతం ఈ సినిమా ఆకట్టుకుంది. ట్రైలర్ చూస్తే ఇదొక పీరియాడికల్ సినిమాగా తెలుస్తోంది. ఎప్పటిలాగే విజయ్ సేతుపతి రా అండ్ రస్టిక్ లుక్ తో అదరగొట్టాడు. అణగారిని వర్గాల కోసం పోరాడే పెరుమాళ్ అనే నాయకుడిగా హీరో కనిపించనున్నాడు. ఆపరేషన్ ఘోస్ట్ హంట్ పేరుతో విజయ్ కోసం పోలీసులు గాలిస్తుంటారు. కులం అనే మరో సామాజిక అంశాన్ని దర్శకుడు సబ్జెక్టుగా ఎంచుకున్నాడు. సహజమైన యాక్షన్ సన్నివేశాలు, అక్కడక్కడా ఒళ్లు గగుర్పొడిచే సీన్లు, ఇళయరాజా బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ తో ట్రైలర్ ను ఇంట్రెస్టింగ్ గా మలిచారు. గౌతమ్ మీనన్ కీలక పాత్రలో నటించాడు. ఏప్రిల్ 15న సినిమాను విడుదల చేయనున్నారు.

# 'ఆడు జీవితం' కు ఆస్కార్ పక్కా?

కథలు ఎంచుకోవడం నటించడంలో నైపుణ్యం సినిమాలను అద్భుతంగా తెరకెక్కించగల టాలెంట్ ఉన్న ఉన్న నటుల్లో ఒకరైన మలయాళ సూపర్ స్టార్ పృథ్వీ రాజ్ సుకుమారన్ ఒకరు. అయితే దర్శకధీరుడు రాజమౌళి తెలుగు చిత్రసీమకు ఏ విధమైన పేరు తీసుకువచ్చారో.. తాను కూడా మలయాళ సినీ రంగానికి అలాంటి పేరే తీసుకు రావాలని అనుకుంటున్నట్లు గతంలో ఓ కార్యక్రమంలో వెల్లడించారు. బాహుబలి ఆర్ఆర్ఆర్ సినిమాల్లాంటి చిత్రాలను మలయాళంలో తెరకెక్కించి... ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాలని కలలు కన్నాడు. అయితే తాజాగా పృథ్వీరాజ్ సుకుమారన్ కొత్త సినిమా ట్రైలర్ చూస్తే.. రాజమౌళి సినిమాలను బీట్ చేస్తుందేమో అనిపిస్తుంది. ఆడు జీవితం ట్రైలర్ చూస్తే అంతా షాకవ్వాల్సిందే. అద్భుతమైన ఈ ట్రైలర్ ను ఇంగ్లీష్ లో ది గోట్ లైఫ్ పేరుతో విడుదల చేస్తున్నారు. ఇప్పటికే అవార్డు కోసం ఫిల్మ్ ఫెస్టివల్ కు ఈ ట్రైలర్ ను కూడా పంపించారు. అది కాస్తా లీక్ అవ్వడంతో... పృథ్వీరాజ్ సుకుమారన్ సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ విడుదల చేశారు. జాతీయ అవార్డు గ్రహీత ఫిల్మ్ మేకర్ బ్లెస్సీ దర్శకత్వం వహించిన ఈ సినిమా ట్రైలర్ కు విశేష స్పందన లభిస్తోంది. బెన్యామిన్ రచించిన 'ఆడు జీవితం' నవల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. పొట్టకూటి కోసం ఏజెంట్లను నమ్మి సౌదీకి అరేబియాకు వలస వెళ్లి.. అకక్కడ ఎడారిలో మేకల కాపరిగా తన పని చేయాల్సి వస్తుంది. అది ఇష్టంలేకపోయినా ఇంటికి వెళ్లలేక బలంవంతగా జీవితాన్ని వెళ్లదీస్తుంటాడు. కథ పక్కన పెడితే.. వలస కూలీగా బానిసగా పృథ్వీరాజ్ తన లుక్ మార్చుకున్న తీరు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. పృథ్వీని ఈసినిమాలోని క్యారెక్టర్ కు చాలా బాగా సెట్ అయ్యాడు. ఎవరైనా సడెన్ గా చూస్తే అతడు పృథ్వీ అంటే కూడా నమ్మలేరు. చాలా సంవత్సరాల నుంచి ఈ సినిమా కోసం పని చేస్తున్న పృథ్వీ రాజ్ సినిమా ఔట్ పుట్ మీద చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడు. ఈ సినిమాలో పృథ్వీరాజ్ భార్యగా అమలాపాల్ నటించారు. షూటింగ్ అంతా దాదాపు జోర్డాన్ అల్జీరియాలోని సహారా ఎడారిలో జరిగినట్లు తెలుస్తోంది. ఈ సినిమాను బాగా ప్రమోట్ చేస్తే ఈ చిత్రానికి ఆస్కార్ నామినేషన్ వచ్చే అవకాశం ఉందని చాలా మంది భావిస్తున్నారు. మరి చూడాలి ఈ సినిమా ఏ రేంజ్ లో ఆకట్టుకోనుందో

# దసరాలో కీర్తి సురేశ బరాత్ వీడియో విడుదల

పెళ్లి బరాత్ అంటే తెలంగాణలో మామూలుగా ఉండదు. మాస్ స్టెప్పులు..ఊరమాస్ ఎక్స్ ప్రెషన్స్?తో దుమ్మురేపుతారు. చిన్నా పెద్దా తేడా లేకుండా డీజే పాటలు వినిపించాయంటే చాలు..కాలు ఆటోమేటిక్గా ఆడాల్సిందే. అలాంటి బరాత్ డ్యాన్సుతో స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ అదరగొట్టింది. ఊరమాస్ స్టెప్పులతో కేక పుట్టించింది. తెలంగాణా సంప్రదాయలు, సంస్కృతికి దసరా చిత్రంలో పెద్ద పీట వేశారు. అయితే



ఈ సినిమాలో ముఖ్యంగా బరాత్ డాన్స్ ని పెట్టారు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల. సినిమలో వెన్నెల పాత్రలో నటించిన నటించిన కీర్తిసురేశ్..ఓ సీన్ లో భాగంగా పెళ్లి కూతురు గెటప్‌లో బరాత్‌లో చేసే డ్యాన్స్ చేసింది. కిక్ ఎక్కించే స్టెప్పులతో హైలెట్‌గా నిలిచింది. కీర్తిసురేశ్ డ్యాన్స్ చేస్తుంటే థియేటర్లలో ఫ్యాన్స్ విజిల్స్ వేస్తున్నారు. మూవీలో చమ్కీల అంగీ వేసి సాంగ్ ఇన్నాళ్లు ట్రెండింగ్‌లో ఉంటే...ప్రస్తుతం కీర్తిసురేష్ మాస్ డాన్స్ దాన్ని బీట్ చేసింది. చిత్రంలో తన పెళ్లి సమయంలో కీర్తి రెచ్చిపోయి డ్యాన్స్ చేసింది. కీర్తి సురేష్ తీన్మార్ స్టెప్పుల వీడియోను మేకర్స్ విడుదల చేయడంతో ప్రస్తుతం వైరల్ అవుతోంది.కీర్తి సురేశ్ డ్యాన్స్ కు ఫిదా అవ్వని వారుండరు. మాస్ స్టెప్పులతో...బ్యాండ్ బీట్‌కు తగ్గట్లు డ్యాన్స్ చేస్తూ ఫ్యాన్స్ మనసులు కొల్లగొట్టింది మహానటి.దసరా మూవీ శ్రీరామనవమి రోజును విడుదలైంది. మొదటి షో నుంచే సూపర్ హిట్టు టాక్ తో దూసుకు పోతుంది.సింగరేణి ఏరియాలోని వీర్లపల్లి గ్రామం చుట్టూ తిరిగే కథ నేపథ్యంలో తెరకెక్కినంది.

# ఇద్దరు హీరోలతో స్టెప్పులేయయనున్న నయన్

## త్వరలోనే పట్టాలకెక్కనున్న కొత్త చిత్రం

అందం, అభినయంతో రెండు దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న అందాల భామ నయనతార భాషతో సంబంధం లేకుండా అన్నిభాషల్లో సినిమాలు చేసింది. నయన్ కొత్త సినిమాను అతి త్వరలోనే ప్రకటించనుంది. ఈ చిత్రంలో ఇద్దరు హీరోలతో కలసి నయన్ రొమాన్స్ చేయనుందని రూమర్స్ హల్‌చల్ చేస్తున్నాయి. నయనతార, మాధవన్, సిద్దార్థ్ తో కలసి సినిమా చేయనుందని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని డెబ్యుటెంట్ తెరకెక్కించనున్నారు. వై నాట్ స్టూడియోస్‌కు చెందిన శశికాంత్ దర్శకత్వం వహించనున్నారు. చాన్నాళ్లుగా నిర్మాతగా వ్యవహరిస్తున్న శశి కెప్టెన్ కుర్చీలో కూర్చొనున్నారు. ఈ మూవీకి 'ది టెస్ట్' అని టైటిల్ పెట్టారని వదంతులు ఉన్నాయి. ఏప్రిల్ చివరి నాటికి సినిమా పట్టాలెక్కనుందని కోలీవుడ్ మీడియాలో గుసగుసలు వినిపిస్తున్నాయి. సిద్దార్థ్, మాధవన్ కలసి గతంలో రెండు సినిమాలు చేశారు. 'రంగ్ దే బసంతి','యువ' చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు. శశికాంత్ గతంలో అనేక సినిమాలను నిర్మించారు. విక్రమ్ వేద, మండేలా, సూపర్ డీలక్స్ వంటి చిత్రాలను ప్రొడ్యూస్ రాశారు. నయనతార, సిద్దార్థ్, మాధవన్ ప్రస్తుతం అనేక సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. లేడీ సూపర్ స్టార్ అతి త్వరలోనే 75వ మూవీ షూటింగ్‌ను ప్రారంభించనుంది. జీడీ. నాయుడు అనే చిత్రాన్ని మాధవన్ ఈ మధ్యనే ప్రకటించారు. ఈ సినిమాలో టైటిల్ రోల్ పోషించనున్నారు. సిద్దార్థ్ 'కీడా కోలా' అనే పాన్ ఇండియా ప్రాజెక్టులో కీలక పాత్ర పోషిస్తున్నారు.

# ఇప్పుడంతా పాన్ ఇండియా టాక్





## నిఖిల్ కన్నా వెనకబడ్డ నాని

చిత్ర పరిశ్రమలో ఇప్పుడంతా పాన్ ఇండియా టాక్ నడుస్తోంది. ప్రతి నటుడు పాన్ ఇండియా కథలు కావాలని అంటున్నారని, ఆలా అయితేనే చేస్తామని కూర్చున్నారని పరిశ్రమలో అంటున్నారు. అడివి శేష్, నిఖిల్, నాని , నవీన్ పోలిశెట్టి ఒకరేంటి ఇప్పుడున్న యువ నటులంతా కూడా పాన్ ఇండియా కథలు అయితే చేస్తున్నారని ఒక వార్త నడుస్తోంది. అయితే మొన్న ఈమధ్య విడుదల అయిన నాని సినిమా 'దసరా' కూడా నాని పాన్ ఇండియా సినిమా అనే చాలా ప్రచారం చేసాడు. నార్త్ లో చాలా నగరాలూ తిరిగి ఆ సినిమా గురించి చాలా ప్రచారం చేసాడు, కానీ ఆ సినిమా తెలంగాణాలో తప్ప వేరే దగ్గర అంచనాలకు తగ్గట్టుగా నడవలేదు. 'దసరా' అన్ని భాషల్లోనే ఒకేసారి విడుదల చేశారు. దీనికన్నా ముందు నిఖిల్ సిద్దార్థ్ నటించిన 'కార్తికేయ 2' తెలుగులో ముందు విడుదల అయి మంచి విజయం సాధించింది. ఆ తరువాత అదే సినిమాని హిందీ లో విడుదల చేస్తే అక్కడ కూడా బ్రహ్మాండంగా నడించింది. నిఖిల్ కి మొదటి వందకోట్ల సినిమా గా నమోదయింది. నాని కన్నా నిఖిల్ చాలా ముందున్నాడు. ఎందుకంటే నిఖిల్ 'కార్తికేయ 2' పాన్ ఇండియా లెవెల్ లో విజయం సాధించటమే కాకుండా, రెవిన్యూ కూడా బాగా రాబట్టింది. ఇప్పుడు నిఖిల్ రాబోయే సినిమా 'స్పై' కూడా పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతోంది. ఆ సినిమా విడుదల కాకముందే నాన్ థియేట్రికల్ హక్కులు అప్పుడే రూ.40 కోట్లకు అమెజాన్ కి అమ్మేశారు. అంటే నిఖిల్ 'స్పై' కి అంత డిమాండ్ ఉందన్నమాట. ఆ సినిమా కూడా చాలా గ్రాండ్ గా తీస్తున్నారు అని కూడా వినికిడి.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com